

అన్నాప్రగడ భానుప్రతాప్, నగర పాలక సంస్థ కమిషనర్

వారంలో సమస్యలు
పరిష్కరిస్తాం



- డివిజన్లలో సమస్యలు ప్రస్తావించిన నగర ప్రజలు
- పారిశుధ్యంపై నిరంతర పర్యవేక్షణకు హామీ
- నగరంలో రూ.3 కోట్లతో రోడ్ల అభివృద్ధి
- కుక్కల నిర్మూలనకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన

ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ భానుప్రతాప్ హామీ

ఏలూరు నగరంలో ప్రజల సమస్యలు, నగర పాలక సంస్థ కమిషనర్‌కు ఆంధ్రజ్యోతి వారధిగా నిలిచింది. మంగళవారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. విశ్రాంత ఉద్యోగులు, అధికారులు, మాజీ కార్పొరేటర్లు ఫోన్ ద్వారా పలు సమస్యలను ప్రస్తావించారు. సమస్యలన్నీ సావధానంగా విన్న కమిషనర్ ప్రజలు మా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలన్నీ యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామన్నారు. వారంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని నగర ప్రజలకు భరోసా ఇచ్చారు. ఆర్థిక వనరులతో ముడిపడి ఉన్న అభివృద్ధి పనులకు రానున్న బడ్జెట్‌లో ప్రతిపాదనలు తయారు చేస్తామన్నారు.

ఏలూరు/ ఏలూరు టుటౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఏలూరును సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు ఒక కార్యాచరణతో ముందడగు వేస్తున్నాం. పారిశుధ్యంపై నిరంతర పర్యవేక్షణతోపాటు చెత్తసేకరణ ప్రధానాంశంగా సాగుతున్నామని నగర పాలక సంస్థ కమిషనర్ అన్నాప్రగడ భానుప్రతాప్ అన్నారు. నగర ప్రజల సమస్యలపై మంగళవారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో ఆయన తక్షణం స్పందించారు. నగరంలో నిత్యం డంపర్ బిన్ వాహనాలు 7, ట్రాక్టర్లు 15, పుష్‌కాట్‌లు 125, 600 మంది సిబ్బందితో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామన్నారు. 16 ఆర్థిక సంఘం నిధులు రూ.3కోట్లతో రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. రూ80 లక్షలతో ఆర్ఆర్‌పేట వెంకటేశ్వరస్వామి గుడి, బిర్లాభవన్ సెంటర్ రోడ్లను అభివృద్ధి చేశామని వివరించారు. కుక్కల సంతతి నివారణకు కు.ని. ఆపరేషన్లు చేయిస్తున్నామని, పందుల సమస్యల నివారణకు యజమానులకు నోటీసులిచ్చామన్నారు. అదనపు కమిషనర్ జి. చంద్రయ్య కూడా ప్రజల సమస్యలను సావధానంగా విన్నారు. ప్రజల సమస్యలు వారి మాటల్లోనే..

రోడ్లు, డ్రెయిన్లు, మార్జిన్ల ఆక్రమణలు..

- వైఎంహెచ్ఏ వద్ద రోడ్లు ఆక్రమణలో ఉన్నాయి. మినీ బైపాస్ రామకృష్ణాపురం వద్ద రోడ్లకు ఇరువైపులా నిలుపుతున్న లారీలను ఖాళీ చేయించాలి. 22వ డివిజన్‌లో రోడ్ల ఆక్రమణలు పెరిగాయి.

  - రామనపూడి శివప్రసాద్, హిందు సంఘాల ఐక్యకార్యాచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు

- అశోక్‌నగర్‌లో మురుగు డ్రెయిన్లపై టిఫిన్ సెంటర్లు, దుకాణాల్లో అపరిశుభ్ర వాతారణంలో విక్రయిస్తున్నారు. బ్రిడ్జి, ఫుట్‌పాత్‌పై చేపలు, రొయ్యల అమ్మకాలతో దుర్వాసన..

  - వి.రాజేంద్రప్రసాద్, పురపాలకశాఖ రిటైర్డ్ ఆర్డీ

- మోతేవారితోట ప్రాంతంలో రోడ్ల టర్నింగ్ పాయింట్ల వద్ద ఫ్లెక్సీలతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల పాలవుతున్నాం. ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

  - బీవీఆర్ చౌదరీ, మోతేవారితోట 22వ డివిజన్

కమిషనర్: ఆక్రమణలపై జిల్లా అధికారులతో జరిగే ట్రాఫిక్ కమిటీలో పెట్టాం. అధికారులతో సమీక్షించి త్వరలో చర్యలు చేపడతాం. అశోక్‌నగర్‌లో డ్రెయిన్లపై వ్యాపారాలను, డ్రెయిన్లలో మురుగును తొలగిస్తాం. బ్రిడ్జిపై చేపల అమ్మకాలను నిరోధిస్తాం. నగరంలో పలుచోట్ల ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను ఎన్నికల కోడ్ నేపథ్యంలో తొలగించాం.

కుక్కలు, పందుల స్వైర విహారం

- వన్‌టౌన్ కూరగాయాల మార్కెట్, చేపల మార్కెట్‌లో వ్యర్థాలు తొలగించడం లేదు. పోణంగి, చొదిమెళ్ల, మాదేపల్లి ప్రాంతాల్లో కుక్కల, పందుల బెడద తీవ్రం.

  - అనూష, తూర్పువీధి

- మోతేవారితోటలోని ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలతో దోమల బెడద పెరిగింది. పందులు, కుక్కలు రాత్రి వేళల్లో ప్రజలను కరుస్తున్నాయి.

  - డి.సత్యనారాయణ, మోతేవారితోట

- శ్రీరామ్‌నగర్ 1వ రోడ్డులో కుక్కలు, పందులు, దోమల బెడద ఎక్కువగా ఉంది. పిల్లలు స్కూల్‌కి వెళ్లాలంటే భయపడుతున్నారు.. దీనిపై చర్యలు తీసుకోండి.

  - బేబీ షకీనా, శ్రీరామ్‌నగర్

- మీసాల అప్పన్నవీధి ఏటిగట్టు రోడ్డులో భోగి మంటల దుంగలు వదిలేశారు. ఈ దుంగ అడ్డంగా ఉండడంతో రాత్రివేళ ప్రమాదాలు జరుగుతున్నాయి.

  - కె సాంబశివరావు, 40వ డివిజన్

కమిషనర్: దుంగలను తక్షణమే తొలగిస్తాం. సిబ్బందిని అక్కడికి పంపిస్తాం. కుళ్లిన వ్యర్థాలను తొలగించి, పరిసరాలు శుభ్రం చేయిస్తాం. కుక్కల నిర్మూలనకు వాటికి కు.ని. ఆపరేషన్లు చేయిస్తున్నాం. దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నాం. పందుల యజమానులతో మాట్లాడి దూరంగా వెళ్లేలా చర్యలు తీసుకుంటాను. ఖాళీస్థలాల యజమానుల ఫోన్ నెంబర్లు సేకరించి, వాటిని శుభ్రం చేయించేలా చూస్తాం. ఇంజనీరింగ్ సిబ్బంది రోడ్డు, డ్రెయిన్ పరిశీలించి అభివృద్ధికి చర్యలు చేపడతారు. కొత్త బడ్జెట్‌లో నూతన రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటా.

- సెయింట్ థెరిసా హైస్కూల్ వద్ద డ్రెయిన్లలో వ్యర్థాలు తొలగించకపోవడంతో దుర్వాసనతో అల్లాడుతున్నాం. పిల్లలు డ్రెయిన్‌లో పడిపోతున్నారు.

  - అనూషా, రాజేశ్వరి ఆర్ఆర్‌పేట, ఎన్ఆర్‌పేట

కమిషనర్ : అది మా పరిశీలనలో ఉంది. పారిశుధ్య సిబ్బందిని పంపి డ్రెయిన్లను శుభ్రం చేయించి, విరిగిపోయిన సిమెంట్ దిమ్మెలను సరిచేస్తాం. షాపులను తొలగించే దిశగా ట్రాఫిక్ అధికారులకు తెలియచేస్తాం.

- రెండో డివిజన్ నేతాజీనగర్‌లో ప్రవేట్ ఖాళీ స్థలాల్లో చెత్తను డంప్ చేస్తున్నారు. అనారోగ్యం పాలవుతున్నారు.

  - షాజిద్ జామా, 2వ డివిజన్

కమిషనర్: ఖాళీ స్థలాల యజమానులు నోటిసులిస్తాం. అక్కడ చెత్త డంప్ చేయకుండా శానిటరీ ఇన్స్‌పెక్టర్లు ద్వారా చర్యలు తీసుకుంటాం.

- మోటేపల్లివారి వీధిలో ఎప్పటికప్పుడు చెత్త తగులబెడుతున్నారు. విపరీతమైన పొగతో స్థానికులు ఇబ్బంది పడుతున్నాం.

  - పద్మావతి మోటేపల్లివారి వీధి

కమిషనర్ : పారిశుధ్య సిబ్బందితో ఇక్కడ చెత్తను తొలగిస్తాం. చెత్త తగులబెట్టే వారిపై తగిన చర్యలు తీసుకుంటాం.

పైపులైన్ లీకేజీ

- అతిథి హోటల్ సమీపంలో హాస్పిటల్ వద్ద పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది.

  - మాజీ కార్పొరేటర్, దాకారపు రాజేశ్వరావు

కమిషనర్: వాటర్ వర్క్సు అధికారులు పరిశీలించి లీకేజిని నివారించేలా తగు చర్యలు తీసుకొంటాం.

- 45వ డివిజన్ గవ్వావారి వీధి పేరుతో కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. బోర్డు పెట్టలేదు.

  మాజీ కౌన్సిలర్, గవ్వానారాయణరావు, గన్‌బజార్

కమిషనర్: గవ్వావారి వీధి పేరుతో కౌన్సిల్‌లో తీర్మానంపై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటా.

- 30వ డివిజన్ మంచినీళ్ల తోటబ్రహ్మంగారి గుడి వద్ద రోడ్లపై గుంతలు పడ్డాయి. స్థానికులు ప్రమాదాల బారిన పడుతున్నారు
- శనివారపుపేట జెడ్పీ హైస్కూల్ పక్కన పెద్దగుంత పడి చెరువులా మారడంతో, అందులో డ్రెయినేజీ నీరు కలిసి అపరిశుభ్రంగా మారాయి. ఇక్కడ ముళ్లచెట్లు పెరగడంతో సమస్యలు పెరిగాయి.

గుంతలను సిబ్బందితో పూడ్పించి వేయిస్తాను. ముళ్లచెట్లను తొలగింపజేస్తాం.





పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి

- 22వ డివిజన్‌లో చెత్త సేకరణ సిబ్బంది ప్రతి రోజు రావట్లేదు.. దోమలతో ఇబ్బంది పడుతున్నాం.

  - నాగమురళి.

- చాణిక్యపురి కాలనీ మెయిన్ డ్రెయిన్ పూడుకుపోయింది. మురుగు, వ్యర్థాలు రోడ్లపైకి వస్తున్నాయి. డ్రెయిన్‌తో రోడ్డు కుచించుకుపోయింది. రోడ్డును వెడల్పు చేసి, ఎత్తు పెంచాలి.

  - పి.భాస్కరరావు, సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం చాణిక్యపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్

- 28వ డివిజన్ క్రాంతినగర్ మెయిన్‌రోడ్డు 10 ఏళ్లుగా అధ్వానం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో గుంతల్లో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

  - మోత్రు శ్యాంబాబు, 28వ డివిజన్

కమిషనర్ : మున్సిపల్ సిబ్బంది ప్రతీరోజూ ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. ఎక్కడైనా రోజూ రాని పక్షంలో చర్యలు తీసుకుంటాం. ఆర్థిక వనరుల సమకూరిన తర్వాత నూతన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనల చేస్తాం. ఈలోగా ఇంజనీరింగ్ అధికారులను పంపి రోడ్డును పరిశీలించి, గుంతలను పూడ్పిస్తాం.

- 30వ డివిజన్ కత్తెపువీధిలచెత్తను నిల్వ చేస్తున్నారు.

  - కోట్నీస్, కత్తెపువీధి

కమిషనర్ : ప్రతీరోజు చెత్తను ఎత్తివేస్తాం. ఈగలు, దోమలు పెరగకుండా తగు చర్యలు తీసుకుంటాం.

పౌల్ట్రీలో కలకలం

- ఉమ్మడి గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ
- తాజాగా వేల్పూరులో వ్యాధి జాడలు
- కలెక్టర్ అత్యవసర సమావేశం
- అప్రమత్తమైన అధికారులు



ఉమ్మడి గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ కలకలం రేపుతున్నది. పెరవలి, వేల్పూరుల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకినట్టు నిర్ధారణ అయ్యింది. దీనితో పౌల్ట్రీ రంగంలో అలజడి మొదలైంది. ఈ రెండు ప్రాంతాలను ఇన్‌ఫెక్షన్ ఏరియాలుగా గుర్తించారు. నిషేధ ఆజ్ఞలు విధించారు. చికెన్, గుడ్ల విక్రయాలను నిలిపివేశారు. ఇతర పక్షులు, అడవి పక్షులపై నిఘా పెట్టారు. పారిశుధ్యాన్ని పూర్తిస్థాయిలో నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు అందాయి. ఏలూరు జిల్లాలోని బాదంపూడిలో కూడా వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. బర్డ్‌ఫ్లూగా అనుమానిస్తూ ఇక్కడి కోళ్ల నమూనాలను పరీక్షలకు పంపారు.



వేల్పూరులో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయిన పౌల్ట్రీ ఫారం

తణుకు రూరల్/ఏలూరు టూటౌన్/ ఏలూరు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాలకు ఆయువు పట్టైన పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పశ్చిమగోదావరి జిల్లాలో తొలి సారిగా బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకింది. వందలాదిగా కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఇది ఎంత వరకు దారితీస్తుందోనని పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. జిల్లా ప్రజలను అప్రమత్తం చేసింది. బర్డ్‌ఫ్లూ వ్యాధి విస్తరించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. ఉభయ గోదావరి జిల్లాల్లో సంక్రాంతి ముందు నాటు కోళ్లు, పందెం కోళ్ళకు సోకిన ఆర్‌డీ వైరస్ చివరకు పౌల్ట్రీ పరిశ్రమకు తాకింది. గత నవంబరు, డిసెంబరు నెలల్లో వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా గ్రామాల్లోని నాటు కోళ్లు, పందెం కోళ్లకు వ్యాధులు వచ్చి చనిపోతున్నాయన్న ఆలోచనలో పౌల్ట్రీ రైతులు పెద్దగా పట్టించుకోలేదు. చివరకు వాతావరణంలోని గాలి, నీరు, పక్షుల కారణంగా పౌల్ట్రీ ఫారాల్లోని కోళ్లకు వ్యాధి సోకింది. రోజూ వేలాదిగా మృత్యువాత పడటంతో ఫారాల్లోని కోళ్ల నమూనాలను ప్రభుత్వం సేకరించింది. జిల్లా అధికారులు నమూనాలను భూపాల్‌లోని పరీక్షా కేంద్రా నికి పంపారు. ఇప్పుడది బర్డ్‌ఫ్లూగా నిర్ధారణ అయ్యింది. దీనితో పౌల్ట్రీ రైతులపై పిడుగు పడినట్లైంది. వాస్తవానికి గత ఏడాది నెల్లూ రు జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఛాయలు కనిపించాయి. జిల్లాలో ఈఏడాది ఆరంభంలోనే పౌల్ట్రీ ఫారాల్లో వ్యాధి జాడలు కనిపించాయి. పౌల్ట్రీల్లో కోళ్ల మరణాలు అధికం కావడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. వివిధ ఫారాల్లోని కోళ్ల నమూనాలను పంపించారు. తణుకు మండలం వేల్పూరు పౌల్ట్రీ ఫారాల నుంచి చనిపోయిన కోళ్లనుంచి సేకరించిన నమూనాల్లో బర్డ్‌ఫ్లూ ఉన్నట్టు నిర్ధారణ అయ్యింది. జిల్లా అధికారులకు భూపాల్ నుంచి నివేదిక అందింది. ఏవీఎన్ ఎన్‌ఫ్లూయింజా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో జిల్లా యంత్రాంగం పౌల్ట్రీ యాజమాన్యాన్ని అప్రమత్తం చేసింది. ఏలూరు జిల్లాలో 635 కోళ్లఫారాల్లో కోటి 30లక్షల బ్రాయిలర్, ఫారం, లేయర్ కోళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు జిల్లాలో ఉంగుటూరు మండలం బాదంపూడిలో మణికంఠ పౌల్ట్రీఫామ్‌లో 2లక్షల కోళ్లు మృత్యువాతపడ్డాయి. అప్రమత్తమైన పశుసంవర్థక శాఖాధికారులు జిల్లాలోని కోళ్లఫారమ్సు అన్నింటిలో శాంపిల్స్ సేకరించి విజయ వాడ ల్యాబ్‌లకు పంపించారు. వాటి ఫలితాలు ఇంకా రానప్పటికి ఉభయగోదావరి జిల్లాల్లో పలు ప్రాంతాల్లో బర్డ్‌ఫ్లూ వ్యాధి నిర్ధారణ అయ్యింది. ఏలూరు జిల్లాలో అవే లక్షణాలు కనపడడంతో ఇక్కడ కూడా బర్డ్‌ఫ్లూతోనే కోళ్లు చనిపోయాయని పశువైద్యులు అవగాహనకు వచ్చారు.

అలర్ట్‌జోన్‌లో 17 గ్రామాలు

బర్డ్‌ఫ్లూ సోకిన వేల్పూరు ప్రాంతం నుంచి 10కిలో మీటర్ల వరకు అలర్ట్ జోన్‌గా నిర్ధారించారు. అలర్ట్ జోన్‌లోని 17 గ్రామాల్లో మూడు వారాల పాటు కోళ్ల ఫారమ్‌లు మూసివేయాలని దిశానిర్దేశం చేశారు. అలర్ట్ జోన్‌లో కొమరవరం, ఇరగవరం, యర్రాయి చెరువు, అత్తిలి, రేలంగి, కావలిపురం, గోటేరు, మండపాక, తేతలి, తణుకు, గుమ్మంపాడు, పాలి, వరిగేడు, బల్లిపాడు, మల్లిపూడి, అర్జునుడిపాలెం గ్రామాలు వున్నాయి. ఈ గ్రామాల్లోని చికెన్‌షాపులు, కోడి గుడ్లు అమ్మకాలను కూడా మూడు వారాలు నిలిపివేయాల్సి ఉంటుంది. వ్యాధి సోకిన కోళ్లను, గుడ్ల రవాణాను పూర్తిగా నిషేధించారు. పశుసంవర్ధక శాఖ వైద్యులు, ఇతర సిబ్బందితో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. పౌల్ట్రీ యజమానులకు, చికెన్ షాపు యజమానులకు నోటీసులు అందించారు.

రంగంలోకి దిగిన అధికారులు

పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పశు సంవర్ధక, పంచాయతీ., మునిసిపాలిటీ, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగారు. రెడ్‌జోన్ పరిధిలో జేసీబీలు, బ్లీచింగ్ పౌడర్‌లను సమకూరుస్తున్నారు. పారిశుధ్యానికి పెద్దపీట వేశారు. పారిశుధ్యంతోపాటు, కోళ్ల నిర్మూలనలో పాల్గొనే సిబ్బంది ఆరోగ్యాన్ని పర్యవేక్షించే బాధ్యతను డీఎంఅండ్‌హెచ్‌వోకు అప్పగించారు. అటవీ, వలస పక్షుల మరణాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సిబ్బందిని నియమించాలని కలెక్టర్ నాగరాణి సూచించారు.

రెడ్‌జోన్‌గా వేల్పూరు


వేల్పూరులోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న కృష్ణానందం పౌల్ట్రీలోని కోళ్ల నమూనాలలో బర్డ్ ఫ్లూ (ఏవీఎన్ ఎన్‌ఫ్లూఎంజా పాజిటివ్‌గా) వ్యాధి నిర్ధారణ అయ్యింది. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి దీనిని ధృవీకరించారు. పరీక్షల రిపోర్టులు సోమ, మంగళవారాల్లో అధికారులకు అందాయి. దాంతో జిల్లా యంత్రాంగం అత్యవసర సమావేశం నిర్వహించింది. జిల్లా కలెక్టర్ నాగరాణి అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అప్రమత్తం చేశారు. వేల్పూరులోని పౌల్ట్రీనుంచి కిలో మీటరు వరకు రెడ్‌జోన్‌గా గుర్తించారు. అక్కడ కోళ్లను పూర్తిగా నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. మూడు నెలలపాటు అక్కడ కోళ్లు, గుడ్లు విక్రయించడం నిషేధం.



చికెన్ మార్కెట్ ఢమాల్

కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకడంతో చికెన్‌కు డిమాండ్ పూర్తిగా పడిపోయింది. కోడిమాంసం, గుడ్ల మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడింది. ప్రజలు చికెన్, గుడ్లు తినటానికి భయపడుతున్నారు. మంగళవారం చాలాచోట్ల దుకాణాలు వెలవెలబోయాయి. చికెన్ ధరలు తగ్గిపోయాయి. అయినా కూడా కొనడానికి, తినడానికి ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. పౌల్ట్రీ యజమానులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. కొనుగోళ్లు తగ్గడంతో చికెన్ వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ఈనేపథ్యంలో చేపలు, మటన్‌వైపు మళ్లుతున్నారు. దీంతో మటన్‌కు డిమాండ్ పెరిగింది. సాధారణ రోజుల్లో మటన్ అమ్మకాలు తక్కువ ఉంటాయి. బర్డ్‌ఫ్లూ ప్రభావంతో నాన్‌వేజ్ ప్రేమికులు మటన్, చేపలు, రొయ్యలవైపు మొగ్గు చూపుతున్నారు.

మూడు నెలల వరకు ఆంక్షలు



కోళ్లకు వింతవ్యాధి లేదా బర్డ్‌ఫ్లూ కలకలం రేపుతున్నప్పటికి ఆందోళన అవసరం లేదు. అప్రమత్తంగా ఉంటే సరిపోతుంది. బర్డ్‌ఫ్లూ, వింతవ్యాధి సోకిన కోళ్లఫామ్సు చుట్టూ కిలోమీటరు విస్తీర్ణంలో 144 సెక్షన్ విధించాం. ప్రజలకు సోకకుండా ఆ ఏరియాల్లో ప్రజలను తిరగనివ్వడంలేదు. వింతవ్యాధితో చనిపోయిన కోళ్లఫామ్‌లో మిగిలిన కోళ్లకు కూడా నొప్పి తెలియకుండా కల్లింగ్ పద్ధతిలో చంపివేస్తున్నాం. మూడు నెలలు ఆంక్షలు కొనసాగుతాయి. చికెన్, గుడ్లు 70 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో ఉడకబెట్టుకుని తినవచ్చు.

- డాక్టర్ గోవిందరాజు, జాయింట్‌డైరెక్టర్, పశుసంవర్థకశాఖ

టెన్త్, ఇంటర్ రెగ్యులర్ పరీక్షలతోపాటే
ఓపెన్ స్కూల్స్ పరీక్షలకు ఏర్పాట్లు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది నుంచి రెగ్యులర్ పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలతోపాటే ఓపెన్ స్కూల్స్ పరీక్షలను కూడా ఏకకాలంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో జిల్లాలో ఆ మేరకు ఏర్పాట్లు పూర్తిచేశారు. వేర్వేరుగా సిబ్బందిని నియమిస్తున్నప్పటికీ కేంద్రాలను ఒకేచోట ఉండేలా చర్యలు తీసుకున్నారు. టెన్త్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 133 కేంద్రాలను ఎంపికచేయగా, వీటినుంచే సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్స్) పరీక్షలకోసం ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూ డిలో 17కేంద్రాల్లో విడిగా ప్రత్యేక గదులను కేటాయించారు. ఓపెన్ స్కూల్స్ పరీక్షలనిర్వహణకోసం సీఎస్‌డీవోలు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడి యన్లు, ఇన్విజిలేటర్లను ప్రత్యేకంగా నియమించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 6074మంది హాజరు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో భాగంగా మంగళవారం ఉదయం పూట జరిగిన పరీక్షలకు 3520 మంది విద్యార్థులకు 3384మంది, మధ్యాహ్నం 2754మందికి 2690మంది హాజరయ్యారని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు నమోదుకాలేదన్నారు.

విద్యార్థులకు కోడిగుడ్ల పంపిణీ యథాతథం

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తున్న కోడిగుడ్ల పంపిణీ, వాటిని విద్యార్థులకు ఉడకబెట్టి వడ్డించడంలో ఎటువంటి మార్పులులేవని డీఈవో కార్యాలయ వర్గాలు తెలిపాయి. తూర్పుగోదావరిజిల్లాలో బర్డ్‌ఫ్లూ కారణంగా అక్కడి పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లను వారం రోజులపాటు నిలిపివేసిన నేపథ్యంలో ఏలూరు జిల్లాలో విద్యార్థులకు సరఫరా చేస్తున్న గుడ్లు సురక్షితమైనవేనని వివరించాయి. కోడిగుడ్లను పాఠశాలలకు సరఫరాచేసే కాంట్రాక్టరు కు కృష్ణాజిల్లా ఉయ్యూరులో పౌల్ట్రీల నుంచి పంపిణీ అవుతున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో కోడిగుడ్ల పంపిణీ లేదా విద్యార్థులకు వడ్డించే విషయమై మంగళవారం సాయంత్రం వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు అందలేదని వివరించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 1.13 లక్షల మంది బాలబాలికలు చదువుతుండగా, వీరిలో భోజన పథకాన్ని వినియోగించుకుంటున్న 93 వేల మందికి వారంలో ఐదు రోజులపాటు ఉడికించిన కోడిగుడ్లను వడ్డిస్తున్నారు.

బతుకు భారమై..



ఉంగుటూరు వద్ద రైలు కిందపడి వృద్ధ దంపతుల ఆత్మహత్య

అప్పుల భారమే కారణమంటూ సూసైడ్ నోట్

తాళ్ళముదునూరుపాడులో విషాదం



7లో

వైద్య విద్యార్థి ఆత్మహత్య

కాకినాడ రంగరాయ హాస్టల్‌లో మృతి

యలమంచిలి మండలం బాడవలో విషాదం



- మెయిన్‌లో

ఆహా.. ఏమి రుచి.. అనరా మైమరచి..



సీజన్‌లో లభించే రేగిపండ్లతో ఆరోగ్యం

రేగి వడియాలతో ఉపాధి పొందుతున్న పోలవరం బెస్తవీధి మహిళలు

పోలవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రేగి పండ్లు అంటే చాలామందికి నోరూరక మానదు. రేగి వడియాలు పేరు చెబితే నోట్లో లాలాజలం ఊరుతుంది.. నోట్లో వేసుకోగానే తియ్యగా, పుల్లగా రుచినిచ్చే వీటిని పిల్లలు కూడా ఇష్టంగా తింటుంటారు. ఈ సీజనులో విరివిగా దొరికే రేగిపండ్లను సేకరించి వడియాలు చేసి షాపులకు అమ్మకాలు చేసి ఆదాయ వనరుగా మార్చుకున్నారు పోలవరం బెస్తవీధి మహిళలు. కొంత మంది మహిళలు రేగిపండ్లను సేకరించి వడియాలు పెట్టి ఉపాధి పొందుతున్నారు. ఇద్దరు మహిళలకు రోజు కూలీ నాలుగు వందల రూపాయలు గిట్టుబాటు అవుతుందని, ఆర్డర్లు ఎక్కువగా ఉంటే కూలి పెరుగుతుందని ఇంటి వద్దనే ఉంటూ ఈ విధంగా ఉపాధి దొరకడం బాగానే ఉందంటున్నారు బెస్తవీధి మహిళలు జ్యోతి,వీరలక్ష్మి, అక్షిత, రాణి తదితరులు.

తయారీ ఇలా..

పూర్తిగా ఎర్రటి రంగు వచ్చిన రేగి పండ్లు తాజావి తీసుకోవాలి. 10 కేజీల రేగి పండ్లను శుభ్రంగా నీటిలో రెండు మూడుసార్లు కడిగి నీరు వడగట్టి గ్రైండర్‌లో వేసుకోవాలి. కేజీ ఎర్రటి పండు మిరపకాయలు, కేజీ బెల్లం, అరకేజీ స్ఫటిక ఉప్పు, టేబుల్ స్పూన్ పసుపు వేసుకుని గింజలు నలగకుండా గ్రైండ్ చేసుకోవాలి. చేసుకున్న మిశ్రమాన్ని దుమ్ము దూళి పడని ప్రాంతంలో డాబా లేదా మరే ఇతర ప్రాంతాలలో ప్లాస్టిక్ షీటు లేదా ప్లాస్టిక్ పేపర్ రోలు మీద వేసి అర బెట్టుకోవాలి. రెండు రోజులు ఆరిన తర్వాత వడియాలు తిరగవేసి మళ్లీ ఆరబెట్టుకోవాలి. ఆరిన వాటిని ఇంటిలో వాడుకోవడానికైతే ప్లాస్టిక్ కంటెయినర్‌లో పెట్టి గాలి చొరబడకుండా మూతపెట్టుకోవచ్చు. కాలక్షేపానికి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడే ఈ రేగి వడియాలను పిల్లలు, మహిళలు ఎంతో ఇష్టంగా తింటారు.

రేగి పండ్లతో ఆరోగ్య ప్రయోజనాలు

రేగిపండ్లు , వడియాలు తినడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. రక్తశుద్ధి జరుగుతుంది. ఒత్తిడి తగ్గుతుంది.రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. కాలేయం పనితీరు మెరుగుపడుతుంది. ఎముకల్లో ఖనిజ సాంద్రత పెరిగి పటిష్ఠమవుతాయి. మలబద్ధకం తగ్గుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు, సి విటమిన్ పుష్కలంగా ఉంటుంది.



వడియాలు పెడుతున్న దృశ్యం



అరచేతిలో పౌర సేవలు



అందుబాటులోకి వాట్సప్ గవర్నెన్స్ యాప్

ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు పొందే అవకాశం

అవగాహన లేక ఆదరణ కరువు

విస్తృత ప్రచారం ద్వారానే మంచి ఫలితాలు

పెంటపాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పనులన్నీ ప్రజలు తమ ఫోన్ నుంచి నేరుగా చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వాట్సప్ గవర్నెన్స్ అనే యాప్‌ను ప్రవేశపెట్టింది. ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్లనవసరం లేకుండా ఈ యాప్ ద్వారా తమ ఫోన్ నుంచే అవసరమైన సేవలను పొందవచ్చు. అయితే దీనిపై ప్రజల్లో ఇంకా అవగాహన రాలేదు. ఈ యాప్‌ను ఎలా వినియోగించాలో తెలియక సతమతమవుతున్నారు..

యాప్‌ల వివరాలు ఇవీ



ఎడ్యుకేషన్ : ఈ యాప్‌కు సంబంధించి విద్యార్థులకు అవసరమైన హాల్ టిక్కెట్లను నేరుగా డౌన్లోడ్ చేసుకోవచ్చు.అంతే కాకుండా విద్యాశాఖకు సంబంధించి మరింత సమాచారం ఈ యాప్ ద్వారా పొందవచ్చు

టెంపుల్ సర్వీసెస్ : మనకు కావల్సిన దేవా లయాల దర్శనం, రూం టిక్కెట్లు ఈ యాప్ ద్వారా పొందవచ్చు. ఆలయాలలో సేవ చేసుకునే ఉద్దేశం ఉన్న వారు కూడా ఈ యాప్ ద్వారా ఆ అవకాశాన్ని తెలుసుకోవచ్చు

గ్రీవెన్ సర్వీసెస్ : ఈ యాప్‌లో మనం గ్రీవెన్స్‌లో ఎదైన ఫిర్యాదు చేసుకుంటే అది ఎంతవరకు వచ్చింది అనేదానిపై ప్రోగ్రెస్ రిపోర్ట్ తెలుసుకోవచ్చు . అలాగే కొత్తగా ఏమైనా ఫిర్యాదు చేయాలన్నా ఈ యాప్ ద్వారా చేసుకోవచ్చు

ఆర్టీసీ సర్వీసెస్ : ఎక్కడికైనా ప్రయాణం చేయాలంటే ఆర్టీసీలో టిక్కెట్లు బుక్ చేసుకునేందుకు వీలుంటుంది

ఎనర్జీ సర్వీసెస్ : విద్యుత్ బిల్లులు చెల్లించడానికి, కొత్త విద్యుత్ సర్వీసులు పొందడానికి వినియోగించుకోవచ్చు.

హెల్త్‌కార్డు సర్వీసెస్ : ఈ యాప్‌లో ఎన్టీఆర్ వైద్య సేవ సేవను పొందవచ్చు. నూతన హెల్త్ కార్డులను తీసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది

రెవెన్యూ : ఆదాయ, కులం, తదితర ధ్రువపత్రాలను పొంద వచ్చు. రెవిన్యూ శాఖలో ఇతర పనులను కూడా ఈ యాప్ వినియోగించుకుని పూర్తి చేసుకోవచ్చు

పోలీస్ సర్వీసెస్ : ఏదైనా ముఖ్య డాక్యుమెంట్‌లు ఇతర వస్తువులు గాని పోగొట్టుకుంటే ఈ యాప్ దార్వా ఫిర్యాదు చేసుకోవచ్చు. పోలీస్ శాఖ నుంచి ఇతర సేవలను కూడా ఈ యాప్ నుంచి పొందవచ్చు

యాప్‌పై అవగాహన పెంచాలి

ప్రస్తుతం ఈ యాప్ ప్రారంభించి కొన్నిరోజులైనా ఇంకా చాలా మందికి ఈ యాప్ గురించి తెలియదు. దీనికి సంబంధించిన ప్రచారంపై సరిగా దృష్టి సారించక పోవడంతో ఈ యాప్ ఇంకా ప్రజాదరణకు నోచుకోలేదు.కొంతమంది యాప్‌ను వాడుకుందామని చూసినా సర్వర్ లోపాలు, తెలియని ప్రశ్నలతో సమాధానం ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా ఇప్పటికీ చాలామంది తమ అవసరాల కోసం కార్యాలయాలకే పరుగులు పెడుతున్నారు. మండల, గ్రామస్థాయి అధికారులకు కూడా ఇంకా ఈ యాప్ గురించి సరిగా తెలియక పోవడం గమనార్హం. యాప్ ప్రజల్లోకి వెళ్లాలంటే దీనిపై ప్రచారం విస్తృతం చేయాలి. అధికారులకు ఈ యాప్‌ల పనితీరు, వాడే విధానంపై అవగాహన కల్గించాలి.వారి ద్వారా ప్రజలకు యాప్ వాడే విధానాన్ని తెలియజేయాలి.

యాప్ ఎలా వాడాలంటే ..

వాట్సప్ గవర్నెన్స్ యాప్ సేవల కోసం 95523 00009 నంబర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.మొదటి విడతలో 161 సేవలను అందించనున్నారు. ఈ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపించాలి. వెంటనే ఇందులో ఉన్న ఎడ్యుకేషన్, టెంపుల్ సర్వీసెస్, గ్రీవెన్స్ , ఏపీఎస్ఆర్టీసీ , ఎనర్జీ సర్వీసెస్, సీడీఎంఏ, రెవెన్యూ, హెల్త్ , పోలీస్ సర్వీస్ సేవల యాప్‌లు కనిపిస్తాయి. మనకు ఏ శాఖకు సంబంధించి అవసరమో ఆ శాఖకు సంబంధించిన పోర్టల్‌కు వెళ్లి అవసరమైన సేవలు పొందవచ్చు.

• విస్తృత ప్రచారం చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన వాట్సప్ గవర్నెన్స్ యాప్ చాలా మంచి ఆలోచన. ప్రజలు ఇంటినుంచే ప్రభుత్వ సేవలు అందుకునేందుకు ఇది చాలా మంచి అవకాశం. అయితే చాలా మందికి ఈ యాప్ గురించి ఇంకా తెలియదు. దీనిపై సరైన ప్రచారం చేపట్టాలి. అవగాహన సమావేశాలు పెట్టాలి. కొంత సమయం పట్టినా మంచి ఫలితాలు సాధించవచ్చు

-ఎవీ.రామరాజు, విశ్రాంత ఎంఈవో, తాడేపల్లిగూడెం

• కార్యాలయాల వద్ద ప్లెక్సీలు పెట్టాలి



నేను రెండు సమస్యలపై ఈ యాప్‌ను ఉపగించేందుకు ప్రయ త్నించా. వరుసగా మూడు రోజులు ప్రయత్నించినా ఫలితం మాత్రం రాలేదు. సర్వర్ సరిగా పనిచేయక కనీసం లోపల శాఖా పరమైన యాప్‌లు కూడా తెరుచుకోలేదు. ఇలా ఉంటే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం కష్టం. ఈ యాప్ గురించి చాలా మందికి ఇంకా సరిగా తెలియదు. యాప్‌కు సంబంధించి ప్రచారం చేయడంతో పాటూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఈ యాప్ ఇది వాడు కునే విధానంపై ప్లెక్సీలు వేయాలి. అలా చేస్తే కొంతమందికైనా అవగాహన వస్తుంది

-పడాల మురళీ మోహన్‌రెడ్డి, అడ్వకేట్, పెంటపాడు



అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో తృతీయ స్థానం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ అండర్ -16 యూత్ 8వ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలికల జట్టు తృతీయస్థానం, బాలుర జట్టు 4వ స్థానం సాధించిందని, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చంగల నాయుడు, కార్యదర్శి జి.చక్రవర్తి తెలిపారు. క్రీడాకారులను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ట్రెజరర్ కె.మురళీకృష్ణ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.



విద్యార్థి బాబును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తదితరులు

జాతీయ హ్యాండ్ బాల్ పోటీలకు డీఆర్‌జీ విద్యార్థి

పెంటపాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాజమండ్రిలో జరిగిన హ్యాండ్‌బాల్ అంతర విశ్వ విద్యాలయాల జట్టు ఎంపికలో పెంటపాడు డీఆర్ గోయింకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ఫైనల్ ఇయర్ విద్యార్థి బైపో బాబు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వెంక టేశ్వరరావు తెలిపారు. విద్యార్థి మార్చినెలలో తమిళనాడు పెరియార్ విశ్వ విద్యాలయంలో జరిగే జాతీయ పోటీలలో పాల్గొంటారన్నారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి జే.విజయబాబు, పీడీ అజ్జిబాబు, తదితర అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థికి అభినందనలు తెలిపారు.

నేటి నుంచి బధిరుల టి-20 పోటీలు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : భీమవరంలో బుధవారం, గురువారం రెండు రోజుల పాటు పశ్చిమ గోదావరి జిల్లా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న 5వ రాష్ట్రస్థాయి మూగ, చెముడు (బధిరులు) టీ-20 క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీల ఏర్పాట్లు పూర్తి అయ్యాయని అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి, అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరాజు మురళీ కృష్ణంరాజు, కార్యదర్శి సీహెచ్ తాతారావు తెలిపారు. గన్నాబత్తుల క్రీడా మైదానంలో రెండు రోజులపాటు జరిగే పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 10 టీమ్‌ల క్రీడాకారులు, నాలుగు జోన్ జట్లుగా పోటీల్లో తలబడుతున్నారని అన్నారు. పోటీలను ఎమ్మెల్యే అంజిబాబు, డీఎస్పీ జయసూర్య, డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నరసింహరాజు, కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ రాజు (బాబు) తదితర ప్రముఖులు ప్రారంభిస్తారని తెలిపారు.

ముగిసిన మావుళ్లమ్మ ఉత్సవాలు

నేడు, రేపు విశ్రాంతి

14న అమ్మవారికి మహాకుంభ నివేదన.. అన్నసమారాధన

భీమవరం టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, మావుళ్లమ్మ ఉత్సవ కమిటీ, దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన మావుళ్ళమ్మ వార్షిక మహోత్సవాలు మంగళవారం రాత్రితో ముగిశాయి. మంగళవారం అమ్మవారు విజయలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. గత నెల 13 వతేదిన వైభవంగా ప్రారంభమైన ఉత్సవాలు ఇప్పటి వరకు ఎటువంటి ఆటంకంలేకుండా సాగినట్టు ఈవో బుద్ధా మహాలక్ష్మి నగేష్ తెలిపారు. బుధవారం, గురువారం విశ్రాంతి రోజులుగా పాటిస్తారు. 14వ తేదీ శుక్రవారం ఉదయం అమ్మవారికి మహాకుంభ నివేదన జరిగిన తరువాత భక్తులకు అఖండ అన్న సమారాధన నిర్వహిస్తారు.

చివరిరోజు గయోపాఖ్యానం

ఉత్సవాలు ప్రారంభంరోజును హరికథతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం అవుతాయి. చివరి రోజున ప్రతీ ఏడాదిలాగే గయోపాఖ్యానం నాటకంతో ముగించటం ఎప్పటి నుంచో ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా మంగళవారం రాత్రి మావుళ్ళమ్మ నాట్యమండలి ఆధ్వర్యంలో నాటకం ప్రదర్శించారు. సాయంత్రం 4 గంటలకు ప్రజా పిత బ్రహ్మకుమారి నిర్వహకురాలు రేవతిచే ఆధ్యాత్మిక ఉపన్యాసం జరిగింది. సాయంత్రం 5 గంటలకు మౌనిక ఆర్కెస్ట్రా భీమవరం వారిచే సినీ మూజికల్ నైట్ నిర్వహించారు.



విజయలక్ష్మి అలంకారంలో మావుళ్లమ్మ



గయోపాఖ్యానం నాటక ప్రదర్శన

నేడు గాలాయగూడెంలో నిప్పుల గుండం

దెందులూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దెందులూరు మండలం గాలాయిగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ వార్షికోత్సవాలు 8 రోజులుగా ఉత్సవాలు కనుల పండువగా జరిగాయి. బుధవారం ఆలయ ఆవరణలో నిప్పులగుండం ఏర్పాటు చేయనున్నారు. అగ్నిగుండం కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారు. అగ్నిగుండం తొక్కడం వల్ల పిల్లలు లేనివారికి పిల్లలు పుడ తారని భక్తుల విశ్వాసం. దీంతో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. నిప్పుల గుండం తొక్కేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఇప్పటికే ఆలయం వద్దకు చేరుకున్నారు.





నేత్రపర్వం.. నారసింహుని గ్రామోత్సవం

ద్వారకాతిరుమల,ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గరుడ వాహనంపై కనకవల్లీ, లక్ష్మీ సమేతంగా కొలువు దీరిన నారసింహుడు పురవీధుల్లో ఊరేగారు. స్వయంభువమూర్తిగా సుందరగిరిపై కొలువైన శ్రీలక్ష్మీనారసింహుని దివ్య కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆలయంలో మంగళవారం ఉదయం విశేషకార్యక్రమాలు జరిగాయి. పలువురు మహిళలు ఆలయ సమీపంలో పాల పొంగళ్లను వండారు. సాయంత్రం గరుడ వాహనంపై ఉభయ దేవేరులతో అలంకృతులైన స్వామివారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిపారు. కొండపై ఆలయంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను గరుడ వాహనంలో ఉంచి దిగువకు తోడ్కొని వచ్చారు. ఆ తరువాత విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు.

అలరించిన బాలల గెటప్‌లు

కల్యాణ మహోత్సవాలు తిరునాళ్లను తలపిస్తున్నాయి. ఈ ఉత్సవాల్లో దైవ దర్శనంతో పాటు వివిధ వేషదారులు, రంగులరాట్నం, జెయింట్‌వీల్, స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. జాంబవంతుని వేషం, బాలరాక్షసి గెటప్‌లు, గాంధీ వేషం అలరించాయి.





ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లు వండుతున్న మహిళలు

మామిడికి తెగుళ్ల బెడద

పిందె దశలో చీడపీడల ఉధృతి

తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మెరుగైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపడితే మామిడికి మంచి రోజులే.. అనుకూల వాతావరణ పరిస్థితులు, చీడపీడల ఉధృతి నేపథ్యంలో మామిడి నాణ్యత నానాటికి పడిపోతోంది.మామిడిలో సాధారణంగా పూత సీజన్‌గా చెప్పబడే డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్యకాలంలో పూత, పిందె దశలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై కథనం.

• కాయతొలుచు పురుగు



కోస్తా జిల్లాల్లో మామిడిపై తెగుళ్ళు పురుగులే కాక కాయతొలుచు పురుగు ఉధృతి అధికంగా ఉంటుంది. ఈ పురుగుపిందె దశలో నుంచి కాయ పెరిగే దశవరకు కాయను ఆశించి విపరీతంగా నష్టం చేస్తాయి. కాయ కొనభాగంలో రంధ్రం చేసుకుని కాయలోపల జీడిలోకి ప్రవేశించి జీడిలో పెరుగుతాయి. ఫలితంగా కాయలు పిందెదశలోనే విపరీతంగా రాలి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. క్లోరిపైరిపాస్ 2.5 ఎంఎల్ లేదా కార్బారిల్ మూడు గ్రాములకు వేపనూనె 2.5 మిల్లీలీటర్లు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

• బూడిద తెగులు



చల్లనిరాత్రులు, వేడి పగటి వాతావరణంలో పూత, పిందెపై తెల్లని బూజు లాంటి పదార్థం ఏర్పడు తోంది. ఈ శిలీంధ్రం ఆశించడం వల్ల పువ్వులు, పిందెలు రాలి పోతాయి. నీటిలో కరిగే గంధకం మూడు గ్రాములు లేదా మెక్సాకోనాజోల్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తల్లిపురుగులు, పిల్లపురుగులు చేరి లేత ఆకులు, పుష్పగుచ్ఛాలు, పిందెల నుంచి రసాన్ని పీలుస్తాయి. ఫలితంగా పూత,పిందెలు రాలిపోతాయి. ఈ పురుగులు విసర్జించిన తేనెలాంటి తియ్యని పదార్థంపై మసికి కారణమయ్యే శిలీంద్రాలు పెరుగుతాయి.

• పిండినల్లి



భూమిలో పొదగబడిన గుడ్ల నుంచి వచ్చిన పిల్లపురుగులు చెట్లపైకి పాకి, చీమల ద్వారా లేతకాయలపై కాడలపై చేరతాయి. లేతరెమ్మలు, కాయల తొడిమెలపై గుంపులుగా చేరి రసాన్ని పీల్చి నష్టపరు స్తాయి. ఇవి విసర్జించే తియ్యని పదార్థంపై నల్లని మసిమంగు ఏర్పడటానికి కారణమైన శిలీంధ్రాలు పెరుగుతాయి. వీటి తీవ్రత ఫిబ్రవరి, మార్చినెలల్లో అధికంగా ఉంటుంది. ఎక్కువగా ఆశిస్తే కాయలు సరిగ్గా ఎదగక రాలిపోతాయి. క్లోరోపైరిపాస్ 2.5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి చెట్టు మొత్తం కాండంతో సహా తడిచేలా పిచికారీ చేయాలి.



• తామర పురుగులు

ఇవి రెండు మిల్లీమీటర్లు పొడవు ఉండి, కొత్త చిగురు వచ్చేదశలో ఆకుల పై అసాంఖ్యాకంగా చేరి, ఆకులు, పిందెలను గోకి రసాన్ని పీలుస్తాయి. ఫలితంగా అవి రాలిపోయే అవకాశం ఉంది. లేదా రాతిమంగుగా ఏర్పడి, కాయ నాణ్యత పడిపోతుంది. తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 1.5 మిల్లీలీటర్లు లేదా పైనోపాడ్ 1.5 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి.

• మసి మంగు



ఆకులు, పూత, పిందె, కాయలమీద రసం పీల్చే తేనెమంగు పురుగు, తామర పురుగులు ఆశించినప్పుడు అవి విసర్జించే తేనెలాంటి చిగురు పదార్థంపై శిలీంద్రాలు పరాన్న బుక్కులుగా పెరిగి నల్లని మసితెగులు వస్తోంది. ఆకులపై మసితెగులు సోకడం వల్ల కాయల పరిమాణం తగ్గటమే కాకుండా కాయలు రాలిపోతాయి. కాయలు పెరిగే దశలో వచ్చే అకాల వర్షాల వల్ల, మంచువల్ల ఆకులపై మసితెగులు కాయలకు సోకి మసి మంగుగా మారుతుంది. తెగులు సోకిన కాయలపై నల్లనిమచ్చలు ఏర్పడి, అమ్మకానికి పనికిరాకుండా పోతాయి. మసితెగులు సోకిన తరువాత ఏ మందులు పనిచేయవు. తేనె మంచుపురుగు, పిండినల్లి, తామర పురుగుల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలి.

నాణ్యత దెబ్బతినడానికి కారణాలు

మామిడిచెట్లు పెద్దవిగా ఉండి, ప్రతి సంవత్సరం కొమ్మలు కత్తిరింపు చేయకపోవడం.. అధికశాతం తోటల్లో చెట్లవయసు పెరిగి క్షీణ దశలో ఉండటం, సరైన పోషకాలు తగు పాళ్ళల్లో అందించకపోవడం రసాయన ఎరువులను వాడటం, సరైన నీటియాజమాన్య పద్ధతులు పాటించక పోవడం వంటి కారణాల వల్ల కోస్తా జిల్లాల్లో మామిడిలో నాణ్యత దెబ్బ తింటోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

18 నుంచి హైస్కూళ్లలో భాషోత్సవాలు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు భాషోత్సవాలను నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. పఠన పోటీలు, లఘు కథల రచన, భాష ప్రాధాన్యతపై చర్చా గోష్ఠి, స్టోరీ టెల్లింగ్, రోల్‌ప్లే, స్పెల్లింగ్, టీఎల్ఎం తయారీ తదితర అంశాల్లో రోజువారీ కార్యక్రమాలపై షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ మేరకు 18న ఇంగ్లీషు, 19న సంస్కృతం/హిందీ/ఉర్దూ, 20 గిరిజన భాష /కన్నడ/ తమిళ్/ ఒరియా, 21న తెలుగు భాషలపై నిర్దేశిత కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. వీటి నిర్వహణ నిమిత్తం ఒక్కో స్కూల్‌కు రూ.500లు చొప్పున బడ్జెట్ నిధులు విడుదల చేశారు. సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాలను ఏలూరు జిల్లాలో 262, పశ్చిమ గోదావరి జిల్లాలో 213 స్కూళ్లలో జరుపుతారు.

21, 22న జాతీయ స్థాయి సింపోజియం

భీమవరం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 21, 22 తేదీల్లో 'నిపుణ 25' జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐఎస్‌టీఈ) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.మురళీకృష్ణం రాజు చెప్పారు. ఈ మేరకు పోస్టర్‌ను కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్.వి.రంగరాజు మంగళవారం కళాశాలలో ఆవిష్కరించారు. సింపోజియం కన్వీనర్ డాక్టర్ ఎస్.రామగోపాలరెడ్డి మాట్లాడుతూ ఈ రెండ్రోజుల పాటు విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి 30 వేల నగదు బహుమతి అందిస్తామన్నారు.

గురుకులాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని డాక్టర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో నిర్వహించే ఎంట్రన్స్ టెస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కో-ఆర్డినేటర్ బి.ఉమాకుమారి తెలిపారు. ఐదో తరగతికి ఏప్రిల్ 6న ఉదయం 10 నుంచి 12గంటల వరకు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం కోర్సుల్లో ప్రవేశాలకు ఎంట్రన్స్ టెస్టు అదే రోజు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు. దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, మార్చి 6వ తేదీ వరకు గడువు ఉందని వివరించారు. గురుకుల విద్యాలయాలు పెదవేగి, చింతలపూడి, పోలసానిపల్లి, వట్లూరు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, నూజివీడు, ఆరుగొలను, న్యూ ఆరుగొలను, ఎల్.బి.చర్ల, నరసాపురం, పెనుగొండ, ఆచంటలో ఉన్నాయన్నారు. వివరాలకు (99630 07079, 96666 99243) నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

పశు వధశాలపై స్టే పట్ల హర్షం

తణుకు రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలోని లేహం ఫుడ్ పరిశ్రమ(పశు వధశాల)కు బ్రేక్‌లు వేస్తూ రాష్ట్ర హైకోర్టు స్టే ఇచ్చింది. స్టే ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్టు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం తణుకు వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పరిశ్రమ కారణంగా వస్తున్న దుర్వాసనతో స్థానికులు నివాసాల్లో ఉండలేకపోతున్నారని, మహిళలు, చిన్నపిల్లలు తన వద్ద కన్నీరు పెట్టుకున్నారని కారుమూరి పేర్కొన్నారు.వారి వేదనను పరిగణలోకి తీసుకున్న కోర్టు స్టే విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఈ సమావేశంలో రాజేష్ నాథ్ అఘోరి, వి.సాయిబాబా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొన్న భార్య మృతి, నిన్న భర్త..

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : పురుగు మందు తాగిన ఘటనలో నిన్న భార్య దుర్గా మల్లేశ్వరి(73) మృతి చెందగా ఈ రోజు భర్త కొట్నీ జగ్గారావు(77) మృతి చెందాడు. ఏలూరు మండలం సుంకరవారి తోటనకు చెందిన ఆ వృద్ధ దంపతులకు ఏ కష్టం వచ్చిందో ఏమో కాని ఇద్దరూ ఒకేసారి పురుగు మందు తాగారు. భార్య మల్లేశ్వరి మరణించగా, భర్త ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ ఎస్ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనుమానాస్పద మృతులుగా కేసు నమోదు చేశారు.

మసాజ్ సెంటర్‌పై పోలీసుల దాడి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలో మసాజ్ సెంటర్ల పేరుతో వ్యభిచారం నిర్వహిస్తున్నారే సమాచారం పోలీసు ఉన్నతాధికారులకు అందడంతో మంగళవారం రాత్రి ఒక మసాజ్ సెంటర్‌పై టూటౌన్ సీఐ వై.వి.రమణ ఆధ్వర్యంలో దాడి నిర్వహించారు. ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీపంలోని ఓవర్ బ్రిడ్జి కింద ఎస్ఎస్ కాల్ సెంటర్‌ను నాగార్జున, అతని భార్య నిర్వహిస్తున్నారు. బ్యూటీ పార్లర్ ట్రైనింగ్ కోర్సు పేరుతో కొంత మంది యువతులను తీసుకువచ్చి అక్కడ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందడంతో మంగళవారం రాత్రి టూటౌన్ సీఐ వైవి రమణ ఆధ్వర్యంలో దాడి చేసి నాగార్జునను, మరికొంతమందిని అదుపులోకి తీసుకున్నారు.

ఆక్వా షాపులపై విజిలెన్స్ దాడులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలో ఎలాంటి లైసెన్సు లేకుండా చేపల మేత, చేపల మందులను విక్రయిస్తున్నారని జిల్లా రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పి.శ్రీరాంబాబుకు సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు విజిలెన్సు అధికారుల బృందం మంగళవారం సాయంత్రం ఏలూరులోని చేపల మేత, చేపల మందుల షాపులపై దాడులు చేశారు. ఏలూరులో ఉన్న మెస్సర్స్ శ్రీపృధ్వీ ఆక్వాఫీడ్స్ అండ్ నీడ్స్‌కు ఫిషరీస్‌కు ఎటు వంటి లైసెన్సు లేకుండా చేపల మేతలను, చేపల మందులను అమ్ముతున్నట్లుగా గుర్తించారు. దీంతో ఆషాపులో ఉన్న 40లక్షల 73 వేల 329 రూపాయలు విలువైన 28.966 టన్నుల చేపల మేతలు, చేపల మందులను సీజ్ చేశారు. వీటి విలువ 21 లక్షల 51 వేల 607 రూపాయలుగా గుర్తించి కేసులు నమోదు చేశారు.

జాతీయ రహదారిపై ఆటో బోల్తా

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పదహారవ నెంబర్ జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఆటో అకస్మాత్తుగా బ్రేక్ పట్టివేయడంతో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. జంగారెడ్డిగూడెం మండలం కట్టుపొదలవారిగూడెంనకు చెందిన గొల్లపల్లి వెంకటలక్ష్మి, మర్రిపూడి ప్రసన్న, తుమ్మల వసుంధర, కావూరి మరియమ్మ, గొల్లపల్లి నిర్మల, గొల్లపల్లి కుమారిలు కలిసి ఒక ఆటోలో ఏలూరు సమీపంలోని వట్లూరులో ఒక క్రైస్తవ మత ప్రార్థనలకు మంగళవారం ఉదయం వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలవ్వగా డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను హైవే అంబులెన్సు సిబ్బంది ప్రభుత్వాసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారమిచ్చారు..

కుష్ఠు అంతానికి..

కుష్ఠు వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. ప్రాణాంతకమైన వ్యాధిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో నియంత్రణ సాధ్యమైంది. కొంతకాలంగా కుష్ఠు వ్యాధి గ్రస్థులు పెరుగుతున్న దృష్ట్యా ప్రభుత్వం మరలా దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఉభయ గోదావరి జిల్లా వ్యాప్తంగా కుష్ఠు వ్యాధి తీవ్రత ఏ మేరకు ఉందో తెలుసుకోవడం కోసం ప్రత్యేకంగా గుర్తింపు సర్వే చేపట్టింది. ఈ సర్వేలో ఆరోగ్య సిబ్బంది, ఏ.ఎన్.ఎం. ఎం.పి.హెచ్.ఓ. ఆశ కార్యకర్తలు టీమ్‌లుగా ఇంటింటీ వెళ్లి వ్యాధి లక్షణాలు ఆధారంగా వ్యాధిని గుర్తించడం చేస్తున్నారు. అనుమానం ఉన్న వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సంప్రదించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సర్వే లో కుష్టువ్యాధి లక్షణాలను ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జనవరిలో మొదలైన ఈ సర్వే ఫిబ్రవరి 13 వ తేదీతో ముగియనుంది. వ్యాధిపట్ల అవగాహన కల్పిస్తూ వ్యాధి భారిన పడకుండా చేయవచ్చనే లక్ష్యంతో ఈ సర్వే చేపట్టారు. - నిడమర్రు


కొమ్మరలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కుష్ఠు వ్యాధిపై రేపటితో ముగియనున్న సర్వే

జనవరి 30న ప్రారంభించిన అధికారులు

లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలంటూ విస్తృతంగా అవగాహన

నూతన సర్వే వివరాలు ఇవే...

జనవరి 30న ప్రారంభించి ఫిబ్రవరి 13వ తేదీ వరకు నిర్వహించనున్న సర్వేలో ఏలూరు జిల్లా వ్యాప్తంగా 1769 సిబ్బంది పాల్గొనగా పశ్చిమ గోదావరి జిల్లాలో 1354 మంది పాల్గొన్నారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా అనుమానిత కేసులు 4,759 గుర్తించగా పశ్చిమ గోదావరి జిల్లాలో 6500 కేసులు గుర్తించారు. వీటిలో 6 ఏలూరు జిల్లాలో గుర్తించగా పశ్చిమ గోదావరి జిల్లాలో 18 కేసులను గుర్తించారు. ఈ లెక్కను బట్టి కేసుల పెరుగుదలను అధికారులు అంచనా వేయనున్నారు.

కుష్ఠు వ్యాప్తి తీవ్రతను గుర్తించేందుకు సర్వే..

గతంలో కుష్ఠు వ్యాధిని ప్రాణాంతకమని భావించేవారు. ఈవ్యాధి సోకిన రోగులను ముట్టుకోవడానికి కుటుంబ సభ్యులు సైతం ఇష్టపడేవారు కాదు. వ్యాధి బాధితులను ఇంటికి దూరంగా ఉంచేవారు. 1985 -95 దశకంలో ఈ వ్యాధి ఎక్కువైంది. ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో డెల్టా ప్రాంతాలైన ఏలూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం, పాలకొల్లు, ఆచంట, ఆకివీడు ప్రాంతాల్లో ఈ వ్యాధిగ్రస్థులు ఎక్కువగా ఉండేవారు. ఈ వ్యాధి పట్ల ప్రభుత్వం విపరీతంగా ప్రచారం కల్పించడం వల్ల వ్యాధి ప్రారంభ దశలోనే మందులు వాడకం ద్వారా నివారణ చేయగలిగారు. అయితే ఇటీవల జిల్లాల్లో ఇంకా కుష్ఠువ్యాధి కేసులు వెలుగుచూడటంతో ప్రభుత్వం అప్రమత్తమై సర్వేలు నిర్వహిస్తోంది.

లక్షణాలుంటే పరీక్షలు తప్పనిసరి

కుష్ఠు వ్యాధి లక్షణాలు కన్పించిన వెంటనే ఎవరైనా అశ్రద్ధ చేయకుండా వైద్యుడుని సంప్రదించాలి. తొలి దశలోనే వ్యాధిని గుర్తించి నివారణ చర్యలు తీసుకోవచ్చు. కుష్ఠు ముఖ్యంగా బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి లక్షణాలు ముఖ్యంగా చర్మం మీద స్పర్శలేని మచ్చలు ఉన్నా, కనురెప్పలు మూతపడకపోవడం, కనురెప్పలు రాలిపోవడం, అరికాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు, చేతివేళ్లు వంకర్లుపోవడం, శరీరానికి స్పర్శ లేకపోవడం వంటి లక్షణాలు ఉంటే దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకుని చికిత్సను పొందవచ్చు.

కుష్ఠు నివారణ కోసం

కుష్ఠును నిర్ధారించిన తర్వాత మల్టీ డ్రగ్ థెరపీ (ఎండీటీ) కోర్సు వాడాల్సి ఉంటుంది. ఈ మందులు సక్రమంగా 6 నుంచి 12 నెలల పాటు క్రమం తప్పకుండా వాడితే వ్యాధిని పూర్తి నివారించవచ్చు. సకాలంలో వైద్యం ద్వారా వ్యాధి ముదరకుండా చూడవచ్చు. వ్యాధి ద్వారా వచ్చే అంగవైకల్యాన్ని పూర్తిగా నివారించవచ్చు.. చర్మంపై ఏవిధమైన మచ్చలున్నా నిర్లక్ష్యం చేయకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడినిగానీ, లేదా స్కిన్ స్పెషలిస్టును గానీ సంప్రదించి వైద్యం చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఏలూరు జిల్లా వ్యాప్తంగా 1769 మందితో సర్వే..

ఆరోగ్య సిబ్బంది ఒక టీమ్‌గా వారికి కేటాయించిన గృహలను సందర్శించారు. కుష్ఠు వ్యాధి లక్షణాలను ఆయా కుటుంబ సభ్యులకు తెలిపి కేసులను గుర్తించి ఆన్‌లైన్ చేయిస్తున్నాం. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 1769 టీమ్‌లు సుమారు 7,12,439 గృహలను సందర్శించాయి. కొత్తగా కొయ్యలగూడెం, వింజరం, జంగారెడ్డిగూడెం, ఏలూరు అర్బన్ ప్రాంతాల్లో కుష్ఠు బాధితులను గుర్తించాం. ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తించి సరైన వైద్యం చేయించుకుంటే రక్షణ పొందవచ్చు.

కొల్లి సత్యానందం, హెల్త్ ఎడ్యూకేషనల్ ఏలూరు జిల్లా ఆఫీసర్

ముందస్తు అవగాహనే వ్యాధి నివారణకు మార్గం



మన శరీరం మీద ఎటువంటి మచ్చ ఉన్నా అశ్రద్ధ చేయకూడదు. వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలి. అశ్రద్ధ వహిస్తే అంగవైకల్యానికి దారి తీయవచ్చు. వ్యాధిని గుర్తించి మందులు వాడితే మొదటి వారంలోనే 90 శాతం రోగం నయమవుతుంది. తర్వాత డాక్టర్ సిఫారస్సు ననుసరించి మందులు వాడితే సరిపోతుంది. కుష్ఠును గుర్తిస్తే ప్రభుత్వం ముందుగా ప్రెఫిలేక్స్ అనే మందు పంపిణీ చేస్తుంది. దీని ద్వారా లెప్రసీ బారిన పడే అవకాశం ఉండదు. అవగాహనే ఈ వ్యాధి నివారణకు ఉత్తమ మార్గం.

బి. భాను నాయక్, పశ్చిమ గోదావరి జిల్లా డీఎంహెచ్‌వో

ఆసరా దూరమై.. బతుకు భారమై..

చేపట్టిన వ్యాపారాలు కలిసిరాలేదు.. నిండా అప్పుల్లో కూరుకుపోవడంతో ఓ వృద్ధ జంట ఆత్మహత్య చేసుకున్నారు. ఇద్దరి కుమార్తెలకు ఘనంగా పెళ్లిళ్లు చేసి భారీగా ఆస్తులు కూడా పంచి పెట్టారు. బాధ్యతలు తీరిపోవడంతో ఎప్పటినుంచో చేస్తున్న టింబర్ డిపో వ్యాపారంతో జీవితాన్ని వెళ్లదీయవచ్చని అనుకున్నారు. అనుకోకుండా అందులో నష్టాలు రావడంతో హోటల్ వ్యాపారం ప్రారంభించారు. అది కూడా కలసిరాకపోవడంతో అప్పుల భారం మరింత పెరిగింది. ఆస్తులను పిల్లలకు పంచిపెట్టడంతో వారి అనుమతితోనే ఆ ఇళ్లల్లో ఉంటున్నారు. అప్పులకు వడ్డీలు పెరిగిపోవడంతో తీర్చే మార్గంలేక, మరో వైపు తమ పిల్లలకు భారం కాలేక వేదనతో ఆ వృద్ధ దంపతులు సతమతమయ్యారు. వారి ఇబ్బందులు పక్క వారికి కూడా తెలియనీయకుండా అందరితో సరదాగా ఉండేవారు. సోమవారం రాత్రి వరకూ ఇరుగుపొరుగు వారితో మాట్లాడిన వారు ఉదయాన్నే విగతజీవులయ్యారు. వృద్ధ దంపతుల మరణ వార్త తెలుసుకుని ఆ ప్రాంత వాసులంతా విస్మయానికి గురయ్యారు. ఆ దంపతులు పోలీసులకు రాసిన లేఖలో వారి వేదన బయటపడింది. ఉంగుటూరు వద్ద రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు పాల్పడిన ఓ వృద్ధ దంపతుల విషాద గాథ ఇది..

రైలు కిందపడి వృద్ధ దంపతుల ఆత్మహత్య - అప్పుల భారమే కారణమంటూ సూసైడ్ నోట్

ఉంగుటూరు/తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రూరల్ మండలం తాళ్ళ ముదునూరుపాడుకు చెందిన తాడి వెంకట రమణా రెడ్డి(62), భార్య విమలా దేవి(54) ఉంగుటూరు సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. తాళ్ళ ముదునూరుపాడు నుంచి ఆదివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై ఉంగుటూరు పరిసర ప్రాంతాలకు వెళ్లారు. జాతీయ రహదారి పక్కన ద్వి చక్ర వాహనాన్ని ఆపి అక్కడి నుంచి రైల్వే ట్రాక్‌పై నిల్చుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. రైలు వేగంగా వచ్చి వీరిని ఢీకొట్టడంతో మృతదేహాల ముక్కలతో ఆ ప్రాంతమంతా భయానకంగా మారింది. తాడేపల్లిగూడెం రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సోమరాజు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఇరువురి మృతదేహాలను తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.


చెల్లాచెదురైన మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు, వెంకట రమణా రెడ్డి, భార్య విమలా దేవి(ఫైల్)



మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు, సాయిరాం(ఫైల్)

సాయిరాం మృతితో బాడవలో విషాద ఛాయలు

యలమంచిలి/నరసాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడవ సంవత్సరం చదువుతున్న యలమంచిలి మండలం బాడవ గ్రామానికి చెందిన రావూరి సాయిరాం(22) కళాశాల హాస్టల్‌లో సోమవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడన్న వార్తతో మంగళవారం బాడవ గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. సాయిరామ్ చదువులో ఎంతో చురుగ్గా ఉండేవాడని, వైద్యుడు కావాలన్న తన చిరకాల వాంఛ తీర్చుకునేందుకు కష్టపడి చదివేవాడని సహచర విద్యార్థులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని కాకినాడ పోలీసులు తెలిపారు. త్వరలో ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో చదువు ఒత్తిడి తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ప్రేమ వ్యవహారం ఏమైనా కారణంగా ఉందా అనే కోణాల్లో పోలీసులు ఆరా తీస్తున్నారు. సాయిరాం మృతదేహాన్ని మంగళవారం సాయంత్రం 4 గంటలప్రాంతంలో స్వగ్రామం బాడవ తీసుకొచ్చారు. డాక్టరై రావాల్సిన సాయిరాం నిర్జీవంగా తిరిగి రావడంతో తల్లి వరలక్ష్మి గుండెలవిసేలా విలపిస్తోంది. మంగళవారం సాయంత్రం సాయిరాం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. వీరిది మధ్య తరగతి కుటుంబమైనప్పటికీ ఉన్నత చదువుల కోసం కాకినాడ పంపారు. చిన్నప్పటి నుంచీ కుమారుడు మెరిట్‌స్టూడెంట్‌గా రాణిస్తూ, ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీట్ సాధించాడు. రావూరి సుబ్రహ్మణ్యం ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశంలో ఉండి కొడుకును చదివిస్తూ కొన్నేళ్లక్రితం స్వగ్రామానికి వచ్చాడు. రావూరి సుబ్రహ్మణ్యం నరసాపురంలో నూతనంగా నిర్మించుకుని వారంరోజుల క్రితం గృహప్రవేశం చేశారు. గృహప్రవేశానికి వచ్చిన సాయిరాం తమ పట్ల ఎంతో ఆప్యాయత చూపించాడని అతని బంధువులు చెబుతున్నారు. మూడేళ్లలో ఎంబీబీఎస్ పూరిచేసి డాక్టర్‌గా స్థిరపడతాడనుకున్న కుమారుడు మృతి చెందడంతో అతని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు.

జేఈఈ మెయిన్స్‌లో 'తిరుమల' ప్రభంజనం



విద్యార్థులతో తిరుమల కళాశాల యాజమాన్యం

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ మెయిన్స్ సెషన్-1లో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి కోటిపల్లి యశ్వంత్ సాత్విక్ ఈడబ్ల్యుఎస్ కోటాలో ఆలిండియా టాపర్‌గా నిలిచారని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఇప్పటి వరకు అందిన ఫలితాల్లో నలుగురు విద్యార్థులు కోటిపల్లి యశ్వంత్ సాత్విక్, కోడూరి యశ్వంత్ రాజా, పి.షరత్ సంతోష్, దువ్వ ఆశిష్ సాయి శ్రీకర్ 99.99 పర్సంటైల్ సాధించారని, నవులూరి ఆశ్రిత్ సాయి, కంచుమర్తి ఫణీత్ , ఎన్.ఉదయ్ పవన్ 99.98 పర్సంటైల్ సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరక్టర్లు, ప్రిన్సిపాల్‌తో కలిసి తిరుమలరావు అభినందించారు.

విద్యార్థిని బోనాల నిఖిత ప్రతిభ



నూజివీడు : నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని బోనాల నిఖిత 2025 జేఈఈ మెయిన్స్ ఫలితాలలో 99.8 పర్సంటైల్ సాధించింది. నిఖితను గ్రామస్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

విర్డ్ ఆస్పత్రిలో కృత్రిమ అవయవాల పంపిణీ


కాలిపర్స్ అందజేస్తున్న వైద్యులు ముక్కామల

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : విర్డ్ ఆస్పత్రిని ప్రముఖ వైద్యులు ముక్కామల అప్పారావు, పార్థసారథిలు మంగళవారం సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలను, పరిసరాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు గుప్తా ఫౌండేషన్ సహకారంతో అందుతున్న కాలిపర్స్‌ను, కృత్రిమ అవయవాలను 18 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు, ట్రస్టీలు నారాయణ మూర్తి, ఐ.వి.సుధాకరరావు, వైద్యులు భవ్యచంద్, హమీద్, విహారి, బాలాజీ, నాగేంద్రబాబు, సింధు, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

పెయింటర్ ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఏ కారణమో తెలియదు కానీ పెయింటర్ ఉరి వేసుకుని మంగళవారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకున్నాడు.ఏలూరు శివగోపాలపురం రామాలయం ప్రాంతానికి చెందిన కోడి సురేష్ (42)కు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య కూరగాయల షాపులో పనిచేస్తుండగా కుమార్తె ఒక వస్త్ర దుకాణంలో పనిచేస్తోంది. మరో కుమార్తె ఇంజనీరింగ్ చదువుతోంది. సురేష్ పెయింటింగ్ పని చేస్తున్నాడు. మద్యానికి బానిసైన సురేష్ పనులకు సరిగా వెళ్లడం లేదు. మంగళవారం ఉదయం యథావిధిగా అంతా పనులకు వెళ్ళిపోయారు. మధ్యాహ్నం తన భార్య ఇంటికి వచ్చే సరికే ఇంట్లో సురేష్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందడంతో టూటౌన్ ఎస్ఐలు నాగ కల్యాణి, దానం వారి సిబ్బందితో వచ్చి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : భార్యతో గొడవపడి ఒంటరిగా జీవిస్తున్న ఓ వ్యక్తి అదే ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతదేహం కుళ్ళిపోయి దుర్గంధం రావడంతో చుట్టు పక్కల వారు అతని భార్యకు సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి చూసే సరికే మృత దేహం కుళ్లిపోయి ఉంది. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు శ్రీరామ్‌నగర్ 6వ రోడ్డు ప్రాంతానికి చెందిన దేవరపల్లి వెంకటేశ్వరరావు(36)కు భార్య నాగజ్యోతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగజ్యోతి అమీనాపేట బరోడా బ్యాంక్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. వెంకటేశ్వరరావు మద్యానికి బానిసై పనులకు వెళ్లకపోవడంతో ఏడాదిన్నర క్రితం నాగజ్యోతి తన ఇద్దరి పిల్లలను తీసుకుని సమీపంలోని పుట్టింటికి వెళ్ళిపోయింది. అక్కడే ఉంటూ పిల్లలను చదివించుకుంటోంది. అనుకోకుండా వెంకటేశ్వరరావు మృతి చెందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సెల్ ఫోన్ చోరీలో కొత్త ట్విస్ట్

నరసాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : నాలుగు రోజుల క్రితం లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌లో సెల్‌ఫోన్ దొంగతనం చేస్తూ పట్టుబడిన కేసులో కొత్త ట్విస్ట్‌లు వెలుగు చూశాయి. గుంటూరు రైల్వే పోలీసుల వివరాల ప్రకారం ఈ నెల 3న వివేక్ నరసాపురం రైల్వే స్టేషన్‌లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధుల్లో చేరి ఇప్పటి వరకు 15 ఫోన్లు చోరీ చేసినట్టు గుర్తించారు. అరెస్టు చేసి వీరి నుంచి ఈ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి 11 నామినేషన్ల తిరస్కరణ

ముగిసిన నామినేషన్ల పరిశీలన

ఉప సంహరణకు గడువు రేపే

ఏలూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) తూర్పు- పశ్చిమ గోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 11 మంది అభ్యర్థుల నామినేషన్లను వివిధ కారణాల రీత్యా తిరస్కరణకు గురి అయ్యాయి. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన మంగళవారం పూర్తి చేశారు. 43 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని నిర్ధారించారు. ఈ నెల 13వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఈ లోగా ఎంతమంది ఉపసంహరిస్తారో? అన్న ఆసక్తి నెలకొంది. పరిశీలనా కార్యక్రమంలో జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత పాల్గొని పర్యవేక్షించారు. నామినేషన్ల తిరస్కరణకు గురైన వారి పేర్లు ఇలా ఉన్నాయి. స్వతంత్ర అభ్యర్థులైన రాయుడు శ్రీనివాస్, శెట్టిబత్తుల రాజాబాబు, భావన ధాన్యలక్ష్మి, కొండపల్లి శ్రీనివాస్, మహ్మద్ ఆలీ జామ్‌షీద్, డీకేవీ ప్రకాష్, కొరుసు రాజకీర్తి, మొర్ల శ్రీవాణి, జీవదేవ దయాకర్ ఖండవల్లి, పాదముత్యం ప్రతాప్,సీతిపూడి రామకృష్ణల నామినేషన్ల పత్రాలు సక్రమంగా లేవని తిరస్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి వి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.


ఏలూరు కలెక్టరేట్‌లో నామినేషన్ల పరిశీలనలో ఎన్నికల అధికారి వెట్రిసెల్వి, హాజరైన అభ్యర్థులు

పార్లమెంట్‌లో ఎంపీ వాయిస్

మత్స్య సంపద ఉత్పత్తికి ప్రోత్సాహకాలు



ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునేలా మత్స్య సంపద ఉత్పత్తికి కేంద్రం ప్రోత్సాహకాలు అందిస్తుందని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. పార్లమెంట్‌లో ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సమాధానం ఇచ్చారు. గత ఐదేళ్లలో మత్స్య ఆధారిత వ్యాపారంపై వేడిగాలుల ప్రభావం వల్ల మత్స్య సంపదకు వాటిల్లిన నష్టంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మత్స్యసంపద నష్టాలను అధికమించడానికి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆక్వా కల్చర్‌లో కేంద్ర ప్రభుత్వం నిధుల ద్వారా ఆక్వాకల్చ ర్‌ను మెరుగు పరచడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధి పెంపొందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మరోప్రశ్నకు సమాధానంగా మంత్రి జావాబిచ్చారన్నారు. ఈ కామర్స్ ప్లాట్‌ఫాంలో స్వయం సహాయక సంఘాల ఉనికి పెండానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాం ద్వారా మూడు వేల మందికి శిక్షణ ఇచ్చామన్నారు.

పెదవాగు ప్రాజెక్టు సమస్యపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా : ఎమ్మెల్యే చిర్రి

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్ర ఉమ్మడి రాష్ట్రాలకు సంబందించి అశ్వారావుపేట మండలంలోని గుమ్మడివల్లి సమీపంలో గల పెదవాగుప్రాజెక్టు మరమ్మతులకు సంబంధించిన సమస్యపై ఈనెలాఖరులో ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తి సమస్య పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా చూస్తానని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. అశ్వారావుపేటలో జనసేన పార్టీ నాయకులు ఉమాదేవి, నాగబాబునాయుడు కుమారుడు సాయిబాలాజీ కొద్దిరోజుల క్రితం అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడగా ఆ కుటుంబాన్ని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుతో కలిసి మంగళవారం పరామర్శించారు. సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. సాయి బాలాజీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది పెదవాగు ప్రాజెక్టు కట్టతెగటం ద్వారా ఆంధ్రాలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో అనేక గ్రామాలు తీవ్రంగా నష్టపోయాయని, పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లిందన్నారు. పెదవాగు ప్రాజెక్టు సమస్య పరిష్కారానికి ఇరు రాష్ట్రాలు కలిసి పనిచేయాలని కోరారు. నాయకులు జి.రవికుమార్, రాము, అంకత మల్లికార్జునరావు, డేగల రామచంద్రరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి


మాట్లాడుతున్న డీటీసీ షేక్ కరీమ్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం డీటీసీ కార్యాలయంలో పట్టణంలోని ఆటో, మ్యాక్సీ, హెవీ డ్రైవింగ్ స్కూల్ డ్రైవర్లకు రహదారి భద్రతపై రవాణాశాఖ తనిఖీ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ ప్రతి వాహన చోదకుడు తప్పకుండా రహదారి భద్రత నియమాలను పాటించినప్పుడే ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించగలమన్నారు. మద్యం సేవించి వాహనం నడపవద్దని, దాని వల్ల మెదడు మొద్దుబారి, వివేకం కోల్పోయి డ్రైవింగ్‌పై పట్టు తప్పి ప్రమదాలు జరుగుతాయని తెలిపారు. రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమానికి 95 మంది డ్రైవర్లు హాజరయ్యారు. ఆర్టీవో కేఎస్ఎంవీ కృష్ణారావు, పరిపాలన అధికారి ఎం.రాము, ఎం.ఆనంద్‌కుమార్, వాహన తనిఖీ అధికారులు బి.శేఖర్, దుర్గ విఠల్, వై.సురేష్‌బాబు, ఎస్.జగదీష్, అజ్మీరాబద్దు, ఎండి జమీర్, వైఎస్‌వీ కల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

యునాని వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం

ఏలూరు అర్బన్/ఏలూరుక్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కొవిడ్ విపత్కర రోజుల్లో ప్రజలు ప్రాణాపాయంనుంచి తప్పించుకునేందుకు యునాని వైద్య విధానాలవైపు మొగ్గు చూపడం అధిక మైందని ఆయుష్‌శాఖ ప్రాంతీయ ఉపసంచాలకులు డాక్టర్ కల్పనా కటాక్షం అన్నారు. యునాని వైద్యాన్ని ప్రపంచదేశాలకు పరిచయం చేసిన మసీహుల్ ముల్కహీమ్ అజ్మల్‌ఖాన్ 157వ జయంతిని పురస్కరించుకుని ఏటా ఫిబ్రవరి 11న నిర్వహించే ప్రపంచ యునాని దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలోని యునాని ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీడీ మాట్లాడుతూ కొంత కాలంగా అల్లోపతి వైద్యులు కూడా యునాని వైద్యాన్ని ప్రోత్సహిస్తుండటం విశేషపరిణామమన్నారు. యునాని ఆస్పత్రి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.రఘునాథ్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని ఏలూరు, బుట్టాయిగూడెం, ఆకివీడులలో ప్రభుత్వ యనాని డిస్పెన్సరీలు నిర్వహిస్తున్నామని, ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. బుట్టాయిగూడెం వైద్యాధికారి డాక్టర్ జి ప్రియదర్శిని, డాక్టర్ కేఎల్ సుభద్ర, డాక్టర్ కె రాణి, వైద్య సిబ్బంది ఎంకె జమ, బ్రహ్మానందం, పెర్కిమణి తదితరులు పాల్గొన్నారు.

అమర గాయకుడు ఘంటసాలకు ఘన నివాళి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అమర గాయకుడు ఘంటసాల అని, ప్రజల హృదయాల్లో నేటికీ చిరస్థాయిగా నిలిచే ఉన్నారని జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఘంటసాల వర్ధంతి సందర్భంగా స్థానిక రామకృష్ణాపురం సాహిత్యమండలి ప్రాంగణంలో ఉన్న ఘంటసాల విగ్రహానికి ఘంటసాల సంగీత కళాశాల అధ్యక్షురాలు వి.రేవతి, పెదపాటి రామకృష్ణ, పుల్లాబొట్ల పురుషోత్తమరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఘంటసాల పాడిన గీతాలు ఇప్పటికి ప్రజల హృదయాల్లో నిలిచే ఉన్నాయని, మహనీయుడు ఘంటసాల విగ్రహాలను ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. హేలాపురి కళాకారుల సంఘం అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ మాట్లాడుతూ ఘంటసాల గానం అజరామరం అన్నారు. సంస్థ కార్యదర్శి పుల్లాబొట్ల పురుషోత్తంను అభినందించారు. గాయకులు శ్రీహరికోటి, ఆచారి, శ్రీనివాస్, ఘంటసాల గానం చేసిన గీతాలను ఆలపించారు. సత్యనారాయణ, వెంకట్రావు, సత్యవాణి, విజయలక్ష్మి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వారంలో సమస్యలు పరిష్కరిస్తాం

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన

ఏలూరు నగరంలో ప్రజల సమస్యలు, నగర పాలక సంస్థ కమిషనర్‌కు ఆంధ్రజ్యోతి వారధిగా నిలిచింది. మంగళవారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు, అధికారులు, మాజీ కార్పొరేటర్లు, ప్రజలు ఫోన్ ద్వారా తెలిపిన మరిన్ని సమస్యలు ఇలా..

పార్కులు, ఇతర సమస్యలు

ఆర్ఎంఎస్ కాలనీ మొదటి రోడ్డులో డ్రెయినేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నాం, చిన్నపాటి వర్షానికే డ్రెయిన్లపై నీరు ఇళ్లల్లోకి వచ్చి ఇబ్బందులు పడుతున్నాం. కుక్కలు బెడద ఎక్కువైంది. రూ.30లక్షలతో అభివృద్ధి చేసిన పార్కులో చెత్తను తగులబెడుతున్నారు. మసితో మొక్కలు చనిపోతున్నాయి. జిల్లా రిటైర్డు ఆడిట్ అధికారి, మూర్తి, ఆర్ఎంఎస్ కాలనీ మొదటి రోడ్డు,

కమిషనర్ : మా సిబ్బంది డ్రెయినేజీ సమస్యను పరిశీలించి, యుద్ధప్రాతిపదికన సమస్యను పరిష్కరిస్తారు.

సమస్య : వంగాయగూడెంలో జర్నలిస్టు కాలనీలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. రోడ్లు, డ్రెయిన్లు అధ్వాన్నంగా ఉన్నాయి. కాల్వలో పూడికలు తీయడం లేదు. మల్లేశ్వరి, దుర్గాప్రసాద్, ఇందిరా

కమిషనర్ : సిబ్బందిని పంపించి డ్రెయిన్లు పూడికలు తీయిస్తాం. రోడ్లపై గుంతలను పూడ్చిస్తాం.

సమస్య : గాంధీనగర్ కొత్తపేటలో డ్రెయిన్లలో స్థానికులు చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేయడంతో పారుదల సరిగ్గా లేదు. దీంతో దోమల బెడద ఎక్కువైంది. కుక్కల స్వైర్య విహారం చేస్తున్నాయి. వీ శ్రీరామచంద్రమూర్తి

కమిషనర్ : పారిశుధ్య సిబ్బందిని పంపించి చెత్తను తొలగించి మురుగు సరిగ్గా పారేలా చర్యలు తీసుకుంటాం.

సమస్య: 49వ డివిజన్ లక్ష్మీనగర్‌లో ఖాళీస్థలాల్లో మురుగునీరు, పిచ్చిమొక్కలు పెరగడం వలన వాటిలో పందులు దొర్లాడి దోమల బెడదతో సతమతం అవుతున్నాం. వీటిలో పందులు చనిపోయి దుర్వాసన వస్తున్నాయి... మా వీధిలో డ్రెయిన్ వేశారు. రోడ్డును నిర్మించలేదు.- గృహలక్ష్మి, లక్ష్మీనగర్

కమిషనర్ : పందుల సమస్య నివారణకు చర్యలు తీసుకుంటాం. పిచ్చిమొక్కలు తొలగింపును యంత్రాల ద్వారా చేస్తాం.

సమస్య: దొండపాడు దత్తాశ్రమం వద్ద 3వ వీధి రోడ్డును నిర్మించలేదు. దీని వలన మట్టితో ఇబ్బంది పడుతున్నాం. నూతన రోడ్డును నిర్మించండి..మంగాదేవి,విజయమేరి,రమేష్ దొండపాడు

సమస్య : 42వ డివిజన్ కర్రిరామారావు వీధిలో రోడ్డు సగం వదిలేశారు. చాలా కాలం నుంచి పట్టించుకోలేదు. డ్రెయిన్లలో మురుగు రోడ్డుపైకి వస్తుంది. మీరైనా రోడ్డును పూర్తి చేయండి

సమస్య : 30వ డివిజన్ మోతేవారితోట 7వ రోడ్డులో మురుగునీరు పారడం లేదు. రోడ్లను మెరక చేయాలి. సూర్యారావు

సమస్య: గొల్లాయగూడెం కాలనీ ఇందిరానగర్‌లో నూతన రోడ్లను నిర్మించాలి. సూర్యనారాయణ 42వ డివిజన్

కమిషనర్ : నిధులు వచ్చాక రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తాం. పాత రోడ్డును పూర్తి చేయడానికి చర్యలు చేపడతాం.

పేద విద్యార్థులకు సాయం చేయండి

» ఎమ్మెల్యే బడేటి చంటి


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు సాయం చేయడానికి దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే చంటి జన్మదినోత్సవం బుధవారం పురస్కరించుకుని అమ్మానాన్న ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.25వేలు విలువ గల శ్రీకృష్ణదేవారాయ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, నగదు బహుమతులను మంగళవారం అందజేశారు. ప్రతీ ఏడాది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నులు, నగదు బహుమతి పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ఛైర్మన్ మారం హనుమంతరావును అభినందించారు. కార్యక్రమంలో బంద్రెడ్డి వాసు, అడ్వకేట్ సురేష్, గంగాధరరావు, శ్రీనివాస్, జి.నాగేశ్వరరావు, జి.మాధవరావు, దళపతి శ్రీనివాసరాజు, ప్రభు, కాకరాల గణేష్, విజయ్‌వర్మ, మారం జయసూర్య, తదితరులు పాల్గొన్నారు.

సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో..

ఏలూరు కార్పొరేషన్: స్థానిక తూర్పువీధిలో గల ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం దత్తత ఆలయమైన రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి దివ్య కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పట్టు వస్త్రాలను సమర్పించారు. నగరానికి చెందిన మడుపల్లి మోహనగుప్త, బండి వెంకటసుధీర్, సన్నా నాగభూషణం, టి.వి. సుబ్బారావు, వాసవీ సుబ్బారావు, కల్వ వెంకయ్యగుప్త, చలువాది బాలకృష్ణ, కల్వ వెంకట సుబ్బారావు, తదితరులు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. దేవాలయాన్ని, పరిసరాలను విద్యుద్దీ పాలంకరణతో తీర్చిదిద్దారు.

కూటమితోనే కొల్లేరు ప్రజలకు న్యాయం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని కొల్లేరు సీనియర్ నేత, శ్రీపర్రు టీడీపీ నాయకులు సైదు గోవర్ధన్ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొల్లేరు ఆపరేషన్ తరువాత కొల్లేరు ప్రజలకు గత తెలుగు దేశం ప్రభుత్వం మాత్రమే మేలు చేసిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చి ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయలేదని, కాంటూరు కుదిస్తామని జగన్మోహన్‌రెడ్డి మాయమాటలు చెప్పారన్నారు. కూటమి పాలనలో ఐదో కాంటూరు నుంచి మూడో కాంటూరుకు కుదించి కొల్లేరు ప్రజలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డీఈవో ఆకస్మిక తనిఖీ

భీమడోలు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పూళ్ళ జిల్లా పరిషత్ హైస్కూలులో డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు జరుగుతున్న ప్రీఫైనల్ పరీక్షలను పరిశీలించారు. ఈ ఏడాది 103 మంది విద్యార్థులు పదో తరగతి ఎగ్జామ్స్ రాయబోతున్నారని గతంలో కంటే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరగాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వస్త్రాలపై డిజైనింగ్, ప్రింటింగ్ శిక్షణ ముగింపు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : డిజైన్ అండ్ స్క్రీన్ ప్రింటింగ్ అనే అంశంపై స్థానిక సీఆర్ఆర్ కళాశాల మహిళాసాధికారత విభాగం ఆధ్వర్యంలో రెండురోజులుగా జరుగుతున్న వర్క్‌షాపు మంగళవారం ముగిసింది. వస్త్రాలపై డిజైనింగ్, ప్రింటింగ్‌ల ప్రాధాన్యత, మార్కెటింగ్, మహిళలకు ఉపాధి అవకాశాలపై వందమందికి శిక్షణ ఇచ్చారు. కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామరాజు మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధికి డిజైనింగ్, ప్రింటింగ్ రంగంలో అవకాశాలు మెండుగా ఉన్నాయమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు, శిక్షణాధికారిణి బి.జ్యోతి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ లావణ్యా పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

లింగపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలంలో మండలంలోని అన్ని గ్రామాలలో తాగునీటి సమస్యలేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.వాణి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు అందించే మంచినీటి పైపులైన్లు లీకేజీలు లేకుండా చూడాలని సూచించారు.



అచ్చమ్మ పేరంటాలకు ఇంటెలిజెన్స్ డీఎస్పీ పూజలు

దెందులూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లికి ఇంటెలిజెన్స్ డీఎస్పీ మేకా సుధాకర్ దంపతులు పూజలు నిర్వహించారు. మంగళవారం గ్రామంలోని ఆలయానికి కుటుంబ సభ్యులతో సహా విచ్చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా తప్పనిసరిగా పేరంటాలమ్మ ఉత్సవాలకు వచ్చి దర్శనం చేసుకుని వెళతానన్నారు. ఆలయ కమిటీ సభ్యులు డీఎస్పీ దంపతులకు జ్ఞాపికను అందించి సన్మానించారు. విజయవాడ జోనల్ ఆర్టీసీ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, జనసేన రాష్ట్ర కార్యదర్శి నారా శేషు, జనసేన మహిళా నాయకురాలు ఘంటశాల వెంకటలక్ష్మితో పాటు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి సన్మానించారు.


పోలసానపల్లి గురుకుల పాఠశాలలో ఎమ్మెల్సీ ఓట్లను అభ్యర్థిస్తున్న గన్ని, కూటమి నేతలు

'కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరాన్ని గెలిపిద్దాం'

భీమడోలు/కొయ్యలగూడెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను మొదటి ప్రాధాన్యత ఓటు గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానం నుంచి కూటమి తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాజశేఖరాన్ని గెలిపించాలని కోరుతూ పోలసానపల్లి గురుకుల పాఠశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా భీమడోలు జంక్షన్‌లోని పలు వ్యాపార, బ్యాంకింగ్ కార్యాలయాల్లో కూటమి ప్రభుత్వం తరఫున రాజశేఖరాన్ని గెలిపించాలని కరపత్రాలను భీమడోలు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ప్రత్తి మదన్ అందించారు. జనసేన, టీడీపీ నేతలు పాల్గొన్నారు. కొయ్యలగూడెం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రకాశం డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి రాజశేఖరాన్ని భారీ విజయంతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ పరిశీలకులు పుచ్చా విజయ్‌కుమార్, పోలవరం నియోజకవర్గ పరిశీలకులు అనపర్తి వెంకటనారాయణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పారేపల్లి రామారావు, టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్, జనసేన మండల అధ్యక్షుడు తోట రవి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు జ్యేష్ట రామకృష్ణ, పట్టణ జనసేన అధ్యక్షుడు మాదేపల్లి శ్రీను, గొలిశెట్టి వాసు, చోడిపిండి సుబ్రహ్మణ్యం, చింతల వెంకటరమణ, బలుసు నాగేశ్వరరావు, ఏపూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.


బుట్టాయగూడెం బస్టాండ్ సెంటరులో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న గిరిజనులు

మన్యం బంద్ విజయవంతం

» మూతపడిన కార్యాలయాలు, షాపులు, దుకాణాలు, పాఠశాలలు, కాలేజీలు

బుట్టాయగూడెం/జీలుగుమిల్లి/వేలేరుపాడ ం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివాసీ చట్టాల పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివాసీ గిరిజన ప్రజాసంఘాలు పిలుపులో భాగంగా రెండు రోజులపాట జరిగే ఏజెన్సీ మన్యం బంద్ మొదటిరోజు మంగళవారం విజయవంతమైంది. బంద్ సందర్భంగా బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, వ్యాపార సముదాయాలు మూతపడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే ఆయా ప్రాంతాలు, ప్రధాన రహదారులు జనాలు లేక వెలవెలబోయాయి. ఆదివాసీ గిరిజన ప్రజాసంఘాలకు చెందిన నాయకులు, గిరిజనులు బుట్టాయగూడెం బస్టాండ్ సెంటరులో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. నాయకులు కారం రాఘవ, తెల్లం రామకృష్ణ, తగరం బాబురావు మాట్లాడుతూ స్పీకర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు బంద్‌కు మద్దతు తెలిపారు. జీలుగుమిల్లిలో తెల్లం దుర్గారావు, సరియం రా మ్మోహన్, నాయకులు కట్టం నాగేశ్వరరావు, సీహెచ్. సీతారామయ్య ఉన్నారు.

నేడు బంద్ విరమణ

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో బుధవారం జరగాల్సిన మన్యం బంద్‌ను విరమించుకుంటున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు తెలిపారు.

'గిరిజనుల హక్కులను వైసీపీ ఏనాడూ కాపాడలేదు'

చింతలపూడి/జీలుగుమిల్లి/బుట్టాయగూడెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో గిరిజనుల హక్కులను ఐదేళ్ళల్లో ఏనాడూ కాపాడలేదని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇన్‌చార్జి, విశాఖ రీజియన్ ఆర్టీసీ ఛైర్మన్ దున్ను దొర అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో ఆయనతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ వామపక్షాలతో కలిసి ఏజెన్సీ బంద్‌కు పిలుపునివ్వడం విచారకరమన్నారు. ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ ఘన విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. జీలుగు మిల్లి మండలం బర్రింకలపాడులో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ గిరిజన చట్టా లపై అసత్య ప్రచారం చేసే ఆదివాసీ బంద్ కు పిలుపు నివ్వటం తగదన్నారు. కూటమి ప్రభుత్వం గిరిజన చట్టాలకు వ్యతిరేకం కాదన్నారు. బుట్టాయగూడెం మండలం బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆదివాసీలకు అండగా ఉంటుందన్నారు. మడకం రామకృష్ణ, తెల్లం వెంకటేశ్వరావు, పైదా వసంతరావు, వంకా సూరిబాబు, బడిశ ముత్యాలరావు, కుంజం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్ వద్ద ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణానికి ఇటీవల పనులు చేపట్టారు. అక్కడ ఉన్న చెట్లను తొలగించి సమీపంలోని రైలు పట్టాలకు, గోడకు మధ్యలో పడవేశారు. మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి ఎండిపోయిన ఆకులపై కాల్చివేసిన సిగరెట్‌ను పడవేయడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ ప్రాంతంలో చెత్త కూడా ఉండడంతో ఒకేసారి పెద్ద మంటలు, పొగ వ్యాపించడంతో సమీపంలోని వారు ఏలూరు అగ్ని మాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా అసిస్టెంట్ ఫైర్‌ఆఫీసర్ రామకృష్ణ తన సిబ్బందితో హుటాహుటీన వెళ్ళి మంటలను అదుపు చేశారు. ముందస్తుగా మంటలను ఆర్పడంతో ఎలాంటి ఆస్తినష్టం జరుగలేదు.

ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ల పోస్టులను భర్తీ చేయాలి

చింతలపూడి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు వినతిప త్రం అందజేశారు. పట్టణం, మండలం కాకుండా సరిహద్దులో ఉన్న పలు గ్రామాల నుంచి అనేక మంది వైద్యం కోసం ఈ ఆసుపత్రికి వస్తుంటారని, ఏరియా ఆసుపత్రిలో 23 డాక్టర్ పోస్టులకుగాను 11 మంది ఉన్నారని, మిగిలిన 12 పోస్టులను సత్వరమే భర్తీ చేసి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీపీఐ నాయకులు కంచర్ల గురవయ్య, టి.బాబు, కాలేషా, అలగ్జాండర్ తదితరులు ఉన్నారు.

ఇంటర్వ్యూ..

డ్రెయినేజీలను తరచూ శుభ్రం చేయిస్తున్నాం

బీహెచ్ఎస్‌వీ కృష్ణంరాజు పంచాయతీ కార్యదర్శి, భోగాపురం



• గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు తీసుకుంటున్న చర్యలేవి ?

జవాబు : డ్రైనేజీలను తరచుగా శుభ్రం చేయిస్తున్నాం. వీధుల్లో చెత్తా చెదారం వేయకుండా ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించి, డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం.

• తాగునీటి సరఫరాకు తీసుకుంటున్న చర్యలేవి ?

జవాబు : క్లోరినేషన్ చేసిన, సురక్షితమైన నీటిని సరఫరా చేస్తున్నాం. తాగునీటి పైపులు లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

• పంచాయతీల ఆదాయాన్ని పెంచేందుకు చర్యలేవి ?

జవాబు : గ్రామంలో ఉన్న చెరువులకు వేలం నిర్వహించి, తద్వారా వచ్చే ఆదాయంతో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నాం.

• పన్నులు వసూలు చేస్తున్నారా ?

జవాబు : ఇంటి పన్ను, కుళాయి పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాం. బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు పన్నులు వసూలు చేస్తున్నాం. నూరుశాతం వసూలు లక్ష్యంగా పనిచేస్తున్నాం.

(ఆంధ్రజ్యోతి-పెదవేగి)

నేడు పిల్లల గుండె సంబంధిత సమస్యలపై వైద్య శిబిరం

ఏలూరురూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కంజెనిటల్ హార్ట్ డిసీజ్ వీక్ సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పటల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఎస్ రాజు, ఏడీఎంఈ సూపరింటెండెంట్, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి సహకారంతో ఉచిత పీడియాట్రిక్ కార్డియాలజీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు చిన్నపిల్లలకు వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. చిన్నపిల్లల కార్డియాక్ స్పెషలిస్ట్ డాక్టర్ ఆర్.జ్యోతిప్రకాష్, డాక్టర్ వి. వాసుదేవ్, డాక్టర్ కె.అనూష వైద్యసేవలు అందిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

లింగపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సొంత భూమి కలిగి వున్న రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని ఏలూరు జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా అన్నారు. నరసన్నపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే పథకాలైన పీఎంకిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమాకు ఉపయోగపడుతుందన్నారు. జేడీఏ నాగకుమార్, ఏవో కోటగిరి మురళీకృష్ణ, వ్యవసాయశాఖ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు..

» ఏలూరుపాడు నుంచి పాదయాత్రగా శ్రీవారి క్షేత్రానికి..

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): హిందూధర్మప్రచారం నిమిత్తం పలువురు భక్తులు చినవెంకన్న క్షేత్రానికి పాదయాత్రగా వచ్చారు. కాళ్ల మండలం ఏలూరుపాడు నుంచి దాదాపు 200మంది భక్తులు గోవిందా.. గోవిందా అంటూ గోవింద నామస్మరణలతో జెండాలను పట్టుకుని ఆలయానికి వచ్చారు. మెట్ల మార్గంలో ఆలయానికి చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించారు. హిందూ ధర్మపరిరక్షణలో భాగంగా దాదాపు పదేళ్లుగా తామంతా ఈవిధంగా పాదయాత్రగా వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డి-ఫారం భూమి రైతులను విస్మరించడం తగదు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతు విశిష్ట సంఖ్య నమోదులో డి-ఫారం భూమి రైతులను విస్మరించడం తగదంటూ మండలంలోని తిరుమలంపాలెంలో డి-ఫారం భూమి రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వ్యవసాయశాఖ ద్వారా చేపట్టిన రైతు విశిష్ట సంఖ్య నమోదులో డి-ఫారం భూములున్న వారిని విస్మరించడం తగదన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది వెబ్‌సైట్‌లో నమోదు చేయడానికి ప్రయత్నం చేయకపోవడం వల్ల డి-ఫారం భూములకు విశిష్ట సంఖ్య నమోదు కావడం లేదని ఆవేదన చెందారు. కూటమి ప్రభుత్వం స్పందించాలని కోరారు.

నేడు, రేపు విద్యుత్‌కు అంతరాయం

ఏలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కామవరపుకోట మండలం ఆడమిల్లి వద్ద 400 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో పనులు జరుగుతున్నందున పలు మండలాల్లో 12, 13 తేదీల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఈఈ ఫీర్ అహ్మద్ ఖాన్ ఓ ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లలో వ్యవసాయానికి సంబంధించిన త్రీ ఫేస్ విద్యుత్‌ను ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల లోపు దశలవారీగా విద్యుత్‌ను అందిస్తామని తెలిపారు.

మామిడికి తెగుళ్ల బెడద

పిందె దశలో చీడపీడల ఉధృతి

తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మెరుగైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపడితే మామిడికి మంచి రోజులే.. అననుకూల వాతావరణ పరిస్థితులు, చీడపీడల ఉధృతి నేపథ్యంలో మామిడి నాణ్యత నానాటికి పడిపోతోంది.మామిడిలో సాధారణంగా పూత సీజన్‌గా చెప్పబడే డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్యకాలంలో పూత, పిందె దశలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై కథనం.



• కాయతొలుచు పురుగు

కోస్తా జిల్లాల్లో మామిడిపై తెగుళ్ళు, పురుగులే కాక కాయతొలుచు పురుగు ఉధృతి అధికంగా ఉంటుంది. ఈ పురుగుపిందె దశలో నుంచి కాయ పెరిగే దశవరకు కాయను ఆశించి విపరీతంగా నష్టం చేస్తాయి. కాయ కొనభాగంలో రంధ్రం చేసుకుని కాయలోపల జీడిలోకి ప్రవేశించి జీడిలో పెరుగుతాయి. ఫలితంగా కాయలు పిందెదశలోనే విపరీతంగా రాలి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. క్లోరిపైరిపాస్ 2.5 ఎంఎల్ లేదా కార్బారిల్ మూడు గ్రాములకు వేపనూనె 2.5 మిల్లీలీటర్లు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.



• బూడిద తెగులు

చల్లనిరాత్రులు, వేడి పగటి వాతావరణంలో పూత, పిందెపై తెల్లని బూజు లాంటి పదార్థం ఏర్పడు తోంది. ఈ శిలీంధ్రం ఆశించడం వల్ల పువ్వులు, పిందెలు రాలి పోతాయి. నీటిలో కరిగే గంధకం మూడు గ్రాములు లేదా మెక్సాకోనాజోల్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తల్లిపురుగులు, పిల్లపురుగులు చేరి లేత ఆకులు, పుష్పగుచ్ఛాలు, పిందెల నుంచి రసాన్ని పీలుస్తాయి. ఫలితంగా పూత,పిందెలు రాలిపోతాయి. ఈ పురుగులు విసర్జించిన తేనెలాంటి తియ్యని పదార్థంపై మసికి కారణ మయ్యే శిలీంధ్రాలు పెరుగుతాయి.



• పిండినల్లి

భూమిలో పొదగబడిన గుడ్ల నుంచి వచ్చిన పిల్లపురుగులు చెట్లపైకి పాకి, చీమల ద్వారా లేతకాయలపై కాడలపై చేరతాయి. లేతరెమ్మలు, కాయల తొడిమెలపై గుంపులుగా చేరి రసాన్ని పీల్చి నష్టపరు స్తాయి. ఇవి విసర్జించే తియ్యని పదార్థంపై నల్లని మసిమంగు ఏర్పడటానికి కారణమైన శిలీంధ్రాలు పెరుగుతాయి. వీటి తీవ్రత ఫిబ్రవరి, మార్చినెలల్లో అధికంగా ఉంటుంది. ఎక్కువగా ఆశిస్తే కాయలు సరిగ్గా ఎదగక రాలిపోతాయి. క్లోరోపైరిపాస్ 2.5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి చెట్టు మొత్తం కాండంతో సహా తడిచేలా పిచికారీ చేయాలి.



• తామర పురుగులు

ఇవి రెండు మిల్లీమీటర్లు పొడవు ఉండి, కొత్త చిగురు వచ్చేదశలో ఆకుల పై అసాంఖ్యాకంగా చేరి, ఆకులు, పిందెలను గోకి రసాన్ని పీలుస్తాయి. ఫలితంగా అవి రాలిపోయే అవకాశం ఉంది. లేదా రాతిమంగుగా ఏర్పడి, కాయ నాణ్యత పడిపోతుంది. తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 1.5 మిల్లీలీటర్లు లేదా ఫైనోపాడ్ 1.5 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి.



• మసి మంగు

ఆకులు, పూత, పిందె, కాయలమీద రసం పీల్చే తేనెమంగు పురుగు, తామర పురుగులు ఆశించినప్పుడు అవి విసర్జించే తేనెలాంటి చిగురు పదార్థంపై శిలీంధ్రాలు పరాన్న బుక్కులుగా పెరిగి నల్లని మసితెగులు వస్తోంది. ఆకులపై మసితెగులు సోకడం వల్ల కాయల పరిమాణం తగ్గటమే కాకుండా కాయలు రాలిపోతాయి. కాయలు పెరిగే దశలో వచ్చే అకాల వర్షాల వల్ల, మంచువల్ల ఆకులపై మసితెగులు కాయలకు సోకి మసి మంగుగా మారుతుంది. తెగులు సోకిన కాయలపై నల్లనిమచ్చలు ఏర్పడి, అమ్మకానికి పనికిరాకుండా పోతాయి. మసితెగులు సోకిన తరువాత ఏ మందులు పనిచేయవు. తేనె మంచుపురుగు, పిండినల్లి, తామర పురుగుల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలి.

నాణ్యత దెబ్బతినడానికి కారణాలు

మామిడిచెట్లు పెద్దవిగా ఉండి, ప్రతి సంవత్సరం కొమ్మలు కత్తిరింపు చేయకపోవడం.. అధికశాతం తోటల్లో చెట్లవయసు పెరిగి క్షీణ దశలో ఉండటం, సరైన పోషకాలు తగు పాళ్ళల్లో అందించకపోవడం రసాయన ఎరువులను వాడటం, సరైన నీటియాజమాన్య పద్ధతులు పాటించక పోవడం వంటి కారణాల వల్ల కోస్తా జిల్లాల్లో మామిడిలో నాణ్యత దెబ్బ తింటోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్

హాస్య నాటిక పోటీల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ఐటీ విద్యార్థులు ఫెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌లో ఉత్తమ ప్రతిభా పాటవాలు కనబరిచినట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఫిబ్రవరి 7 నుంచి 9వ తేదీల మధ్య హైదరాబాద్‌లోని సుమధుర కళానికేతన్‌లో నిర్వహించిన హాస్యనాటికల పోటీలో అంతిమ సంస్కారం పేరుతో ట్రిపుల్ఐటీ విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ప్రశంసలందుకుందన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన సినీ ప్రముఖులు నిర్మో, సుబ్బరాయశర్మ, కోటా శంకరరావు, జెన్నీలు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారన్నారు. ఏవో డాక్టర్ బి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అభివృద్ధి కార్యక్రమం ప్రారంభం

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసే దిశగా స్టూడెంట్ డెవలప్‌మెంట్ యాక్టివిటీస్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్ అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో స్టూడెంట్ డెవలప్‌మెంట్ యాక్టివిటీలో భాగంగా ప్రాజెక్టు వర్క్‌లను పరిశీ లించారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఇన్‌ఛార్జ్ వరప్రసాద్, డీన్ ఆఫ్ అకాడమిక్స్ చిన్నారావు, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ వసుంధర పాల్గొన్నారు.

గణిత ప్రతిభా పాటవ పరీక్షలో త్రివిధ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రామానుజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 35వ జాతీయగణిత ప్రతిభాపాటవ పరీక్షలో త్రివిధ విద్యార్థులు ఉత్తమ ప్రతిభాపాటవాలు కనబరిచినట్లు ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రాపురంలో ఈ పోటీలు నిర్వహించగా, 6వ తరగతికి చెందిన వై.సత్యానారాయణ, అనన్యరాఘ మొదటి రెండుస్థానాల్లో నిలిచారన్నారు. 7వ తరగతిలో ఏ.దుర్గా, డి.సుమతిలు ద్వితీయస్థానంలోనూ, 8వ తరగతిలో బి.షణ్ముక జిల్లా రెండోస్థానంలోనూ నిలిచారని తెలిపారు. 9వ తరగతిలో ఎం.గీతికాలక్ష్మి, ఎం.వి.ఎస్ పవన్‌కృష్ణ, 10వ తరగతిలో వి.చైతన్య, బి.చిరుత శ్రీలు ప్రథమస్థానంలో నిలిచారని తెలిపారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో త్రివిధ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్

పాల సొసైటీ వజ్రోత్సవాలు

చాట్రాయి/నూజివీడు టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల వెన్నుదన్నుతో కృష్ణామిల్క్ యూనియన్ సహకార రంగంలో మేటిగా నిలిచిందని సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు అన్నారు. మండలంలోని చీపురుగూడెం పాల సహకార సంఘంలో మంగళవారం యూనియన్ వజ్రోత్సవాల సందర్భంగా కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. 2 లక్షల మంది పాడి రైతులు, రూ.1200 కోట్ల టర్నోవర్, 11 కోట్ల లీటర్ల పాల సేకరణతో 4 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నదన్నారు. కోటపాడు, చాట్రాయి, తుమ్మగూడెం మొదలైన అన్ని సంఘాలలో వేడుకలు జరిగాయి. క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి, సిబ్బంది రైతులు పాల్గొన్నారు. నూజివీడు మండలం వెంకటాద్రిపురం మహిళా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం వజ్రోత్సవాలను మంగళవారం నిర్వహించారు. సంఘ అధ్యక్షురాలు, కృష్ణా జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్ శెనగల వెంకట శివజ్యోతి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి వేడుకలను ప్రారంభించారు. పాడి రైతులను సత్కరించారు. సూపర్‌వైజర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



చీపురుగూడెంలో కేక్ కట్ చేస్తున్న డైరెక్టర్, రైతులు

బలివే ఉత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

» సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

ముసునూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆలయ ప్రాంగ ణంలో ఆయన అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. నూజివీడు నుంచి ముసునూరు మండల సరిహద్దు వరకు ఉన్న ఆర్అండ్‌బి రహదారిలో ప్రమాదకరంగా ఉన్న గోతులను పూడ్చాలన్నారు. స్వామివారి దర్శనా నికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా బారికేడ్లు, ప్రసాదాల వితరణకు కౌంటర్లు, క్యూలైన్స్‌లో మంచినీరు, పిల్లలకు పాలు, గుడి లోపల సీసీ కెమెరాల ఏర్పాట్లను దేవదాయ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్సవాల్లో పారిశుధ్యం, మంచి నీటి సౌకర్యం, జల్లుల స్నానాలు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేపట్టాలన్నారు. భక్తులకు వైద్యసేవల నిమిత్తం 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండాలని, రెండు అంబులె న్స్‌లను సిద్ధంగా ఉంచి, అత్యవసర సేవలను అందించాలని వైద్యాధికారులకు సూచించారు. అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచడంతో పాటు తమ్మిలేరులో స్నాన ఘాట్లు వద్ద రెస్క్యూ బృందాలను ఉంచాలన్నారు. ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసి సకాలంలో నడిపేలా చూడాలన్నారు. మద్యం అమ్మకాలు జరుగకుండా ఎక్సైజ్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఉత్సవాలకు రెండు రోజులు ముందుగా తమ్మిలేరు జాలాలు వచ్చేలా ఇరిగేషన్ అధికారులు చూడాలన్నారు. పార్కింగ్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని, ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తమ్మిలేరులో ఏర్పాటు చేసిన స్నాన ఘాట్లను పరిశీలించారు. సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, డీఎస్పీ ప్రసాద్, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఈవో పామర్తి సీతారామయ్య, ఎంపీడీవో జి.రాణి, ఎస్ఐ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించాలి

చాట్రాయి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రులు నియోజకవర్గం పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ మంగళవారం చాట్రాయిలో ప్రజా సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. 2007, 2009లలో టీచర్స్ ఎమ్మెల్సీగా, 2019లో పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన లక్ష్మణరావు ఉద్యోగుల సమస్యలపై శాసన మండలిలో ప్రభుత్వం దృష్టికి తెచ్చి అనేక సమస్యలు పరిష్కారించారన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, హోలీమేరీ, చాగంటి రాజారావు, సూరి, అశోక్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చాట్రాయిలో ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఆసరా దూరమై.. బతుకు భారమై..

ఉంగుటూరు/తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : చేపట్టిన వ్యాపారాలు కలిసిరాలేదు.. నిండా అప్పుల్లో కూరుకుపోవడంతో ఓ వృద్ధ జంట ఆత్మహత్య చేసుకున్నారు. ఇద్దరి కుమార్తెలకు ఘనంగా పెళ్లిళ్లు చేసి భారీగా ఆస్తులు కూడా పంచి పెట్టారు. బాధ్యతలు తీరి పోవడంతో ఎప్పటినుంచో చేస్తున్న టింబర్ డిపో వ్యాపారంతో జీవితాన్ని వెళ్లదీయవచ్చని అనుకున్నారు. అనుకోకుండా అందులో నష్టాలు రావడంతో హోటల్ వ్యాపారం ప్రారంభించారు. అది కూడా కలసిరాకపోవడంతో అప్పుల భారం మరింత పెరిగింది. ఆస్తులను పిల్లలకు పంచిపెట్టడంతో వారి అనుమతితోనే ఆ ఇళ్లల్లో ఉంటు న్నారు. అప్పులకు వడ్డీలు పెరిగిపోవడంతో తీర్చే మార్గంలేక, మరో వైపు తమ పిల్లలకు భారం కాలేక వేదనతో ఆ వృద్ధ దంపతులు సతమతమయ్యారు. వారి ఇబ్బందులు పక్క వారికి కూడా తెలియనీయకుండా అందరితో సరదాగా ఉండేవారు. సోమవారం రాత్రి వరకూ ఇరుగుపొరుగు వారితో మాట్లాడిన వారు ఉదయాన్నే విగతజీవులయ్యారు. వృద్ధ దంపతుల మరణ వార్త తెలుసుకుని ఆ ప్రాంత వాసులంతా విస్మయానికి గురయ్యారు. ఆ దంపతులు పోలీసులకు రాసిన లేఖలో వారి వేదన బయటపడింది. ఉంగుటూరు వద్ద రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు పాల్పడిన ఓ వృద్ధ దంపతుల విషాద గాథ ఇది.

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రూరల్ మండలం తాళ్ళ ముదునూరుపాడుకు చెందిన తాడి వెంకట రమణా రెడ్డి(62), భార్య విమలా దేవి(54) ఉంగుటూరు సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. తాళ్ళ ముదునూరుపాడు నుంచి ఆదివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై ఉంగుటూరు పరిసర ప్రాంతాలకు వెళ్లారు. జాతీయ రహదారి పక్కన ద్వి చక్రవాహనాన్ని ఆపి అక్కడి నుంచి రైల్వే ట్రాక్‌పై నిల్చుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. రైలు వేగంగా వచ్చి వీరిని ఢీకొట్టడంతో మృతదేహాల ముక్కలతో ఆ ప్రాంతమంతా భయానకంగా మారింది. తాడేపల్లిగూడెం రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సోమరాజు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఇరువురి మృతదేహాలను తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

విద్యాసామర్థ్యం పెంచేందుకు ప్రత్యేక దృష్టి : ఎంఈవో

ముదినేపల్లి, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): ముది నేపల్లి మండలం పెయ్యేరు ఎలిమెంటరీ పాఠ శాలను ఎంఈవో-1 ఎం.సేవ్యా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాన్ని పరీ క్షించారు. విద్యార్థుల పాఠ్య పుస్తకాలను చదు వుతున్న తీరు, నోట్సు రాస్తున్న పద్ధతిని పరిశీలించి ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. వి ద్యార్థుల్లో సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీక రించాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకం అమలులో ఎటువంటి పొరపాట్లు లేకుండా చూడాలని ఎంఈవో పాఠశాల హెచ్ఎం బేతాళ రాజేంద్ర ప్రసాద్, టీచర్ చక్రధర్, భోజన ఏజెన్సీకి తెలిపారు. పాఠశాల ఆవరణలో ఆహ్లాదకరంగా మొక్కలను పెంచు తుండటం పట్ల ఆయన విద్యార్థులను, ఉపాధ్యా యులను అభినందించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

బాధితులకు సాయం

ముదినేపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ముదినేపసల్లి మండలం దాకరం గ్రామంలో కేన్సర్ వ్యాధితో బాధపడుతూ మంగళవారం మరణించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త నారగాని నాగమల్లేశ్వరరావు (55) మృతి పట్ల ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ సంతాపం వ్యక్తం చేశారు. మృతుని భౌతికకాయానికి నివాళులర్పించి అతని కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. దాకరం సర్పంచ్ జాస్తి రాజాకు రూ.5 వేలు సహాయం అందజేశారు.

శివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు

కలిదిండి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి పురస్కరించుకుని కలిదిండిలో ఉన్న పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాల ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయ ఆవరణలో భారీ చలువ పందిళ్ల వేశారు. ఆలయం వద్ద ఉన్న పంచ బుగ్గల కోనేరుకు తాజా నీరు పెట్టారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి రేవుల వద్ద సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆలయ ఆవర ణమంతా శుభ్రపరిచారు. ఈ నెల 24 కల్లా ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఈవో శేఖర్ తెలిపారు.

నాగ ప్రతిష్ఠల పూజలు

ముదినేపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం భక్తులు నాగ ప్రతిష్ఠలు నిర్వహించి పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివార్లకు సర్పదోష నివారణ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

గేదెల వివాదంలో కర్రతో దాడి

ముదినేపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం దేవపూడి గ్రామంలో గేదెలు మినుము పొలంలో దిగుతున్నాయన్న నెపంతో పాలడుగు సతీష్‌ను అదే గ్రామానికి చెందిన గిరినాథ్ కర్రతో కొట్టి గాయపర్చాడు. మంగళవారం గేదెలను తోలుకెళ్తున్న సతీష్‌ను పక్క పొలం రైతు గిరినాథ్ మందలించి అతనిని కర్రతో కొట్టగా, తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సతీష్‌ను కుటుంబ సభ్యులు గుడివాడ ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఏఎస్ఐ పద్మజ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సారథి

కలిదిండిలో ఎన్నికల ప్రచారం

కలిదిండి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలిదిండిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, శేషపు మహంకాళీరావు, సీఐటీయూ మండల కార్యదర్శి జక్కుల మహేష్ పాల్గొన్నారు.

ఆలపాటిని గెలిపించాలి : సారథి

ముదినేపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం నుంచి ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషి చేయాలని శాసన మండలి సభ్యుడు డాక్టర్ కామినేని శ్రీనివాస్ కోరారు. ముదినేపల్లి మండలం పెదపాలపర్రు గ్రామంలో మంగళవారం మండల టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి అధ్యక్షతన జరిగిన తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు మండలంలో బూత్ ఇంచార్జ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రులను కలసి కూటమి అభ్యర్థిని గెలిపించాల్సిన ఆవశ్యకతను వివరించాలన్నారు. ఏపీ గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చించే సమర్థత కలిగిన ఆలపాటిని గెలిపించాలని కోరారు.

కన్నుల పండువగా కల్యాణోత్సవం

కైకలూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో కొలువైన శ్రీపార్వతి రామలింగేశ్వర, రామేశ్వర స్వామివార్ల వార్షిక కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి అమ్మవారి కళామండపం వద్ద గొర్తి ప్రభాకర దీక్షితులు దంపతులు, గురజాడ ఉదయశంకర్ దంపతులు కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య మేళతాళాల మంగళ వాయిద్యాలతో స్వామి, అమ్మవార్లను ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి కళామండపంలో ప్రతిష్ఠించారు. పావని మురళీకృష్ణశర్మ యజ్ఞత్వంలో కల్యాణం జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కనులారా కల్యాణాన్ని తిలకించారు.

రైతులు విశిష్ట గుర్తింపు కార్డులు పొందాలి : ఏడీఏ

ముదినేపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు విశిష్ట సంఖ్యతో కూడిన గుర్తింపు కార్డును పొందాలని వ్యవసాయశాఖ మండవల్లి డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.వెంకటమణి తెలిపారు. మంగళవారం ముదినేపల్లి మండలం సింగరాయపాలెం, శ్రీహరిపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మినుము పైరును పరిశీలించి తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను సూచించారు. అనంతరం రైతులతో నిర్వహించిన సమావేశంలో విశిష్ట సంఖ్యతో కూడిన గుర్తింపు కార్డు రైతులకు అన్ని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందేందుకు ఉపకరిస్తుందని వెంకట మణి తెలిపారు. పట్టదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబరు వివరాలను తెలిపి రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకుల వద్ద నమోదు చేయించుకోవాలని ఏవో వేణుమాధవ్ తెలిపారు. పశుసంవర్ధక శాఖ, వ్యవసాయ శాఖ సహాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పంట చేలు పరిశీలిస్తున్న అధికారులు

జేఈఈ మెయిన్స్‌లో నూజివీడు విద్యార్థిని ప్రతిభ

నూజివీడు, ఫిబ్రవరి 11(ఆంధ్ర జ్యోతి) నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని బోనాల నిఖిత 2025 జేఈఈ మెయిన్స్ ఫలితాలలో 99.8 పర్సంటైల్ సాధించింది. నిఖితను గ్రామస్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.



బి. నిఖిల

క్రీడా ఉత్సవాలు ప్రారంభం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సిగ్నస్ 25లో భాగంగా ప్రీమియర్ లీగ్ క్రీడాపోటీలను రిజిస్ట్రార్, ట్రిపుల్ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్ మంగళవారం ప్రారంభించారు. క్రీడలు, విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో దోహదం చేస్తాయన్నారు. స్పోర్ట్స్ హెచ్‌వోడీ నవీన్‌కుమార్, డీన్ ఆఫ్ అకాడమిక్స్ ఎస్.చిరంజీవి, సిహెచ్ సుబ్బలక్ష్మి, సూర్యచంద్రరావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల బాలరావమ్మ మహోత్సవం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల బాలరావమ్మ మాఘ పౌర్ణమి తిరునాళ్ళ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆగిరిపల్లి, తోటపల్లి, కనసానపల్లి గ్రామాల్లో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

టెన్త్ విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలి

ముసునూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని హెచ్ఎం రామకృష్ణారావు అన్నారు. మంగళవారం తల్లిదండ్రులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు స్టడీ అవర్లుకు రావాలని, రెండో శనివారం, ఆదివారం నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరు కావాలన్నారు. ఈ రెండు రోజులు విద్యార్థులకు మిడ్డేమిల్స్ ఉంటుందన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా ప్రణాళిక, తగినంత నీరు, పోషకాహారం పిల్లలకు ఇవ్వాలని సూచించారు.

ఉచిత ఫిజియోథెరపీ క్యాంప్

ముసునూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణక్కపేట మెయిన్ పాఠశాలలో ఉన్న భవిత సెంటర్‌లో దివ్యాంగ పిల్లలకు మంగళవారం ఉచిత ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ ప్రశాంతి 10 మంది పిల్లలకు చికిత్సను అందించి తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంఈవో బి. సుబ్బారావు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

ముసునూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించాలని ఎంఈవో సుబ్బారావు అన్నారు. మంగళవారం చెక్కపల్లి జడ్పీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలించి, ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థు లు ఒత్తిడికి గురి కాకుండా శ్రద్ధగా చదివి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. హెచ్ఎం అబ్బాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

'స్టెమీ'తో గుండెకు భరోసా

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గుండెకు సంబంధించిన రుగ్మతల్లో ప్రాణాపాయం నుంచి రక్షించేందుకు స్టెమీ ఇంజక్షన్ ఉపయో గపడుతుందని, నూజివీడు ఏరియాఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రసింగ్ అన్నారు.మంగళవారం ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో సెమీ ఇంజక్షన్‌పై అవగాహన కల్పించారు. ఛాతీలో నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మికంగా ఆయాసం, గుండెదడ వంటి లక్షణాలు గుండెపోటుకు దారితీయవచ్చన్నారు. ఈ లక్షణాలతో ఎవరైనా బాధపడుతోంటే 108కి ఫోన్‌చేసి సమీపంలో ఉన్న ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లడం ద్వారా ప్రథమ పరీక్షలు నిర్వహించి, మొదటి గంటలోనే స్టెమీ ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా రోగి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. సుమారు రూ.45 వేలు విలువ చేసే ఇంజక్షన్‌ను ఏరియా ఆసుపత్రిలో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.

పేద విద్యార్థులకు సాయం చేయండి

» ఎమ్మెల్యే బడేటి చంటి



విద్యార్థినికి పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): పేద విద్యార్థులకు సాయం చేయడానికి దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే చంటి జన్మదినోత్సవం బుధవారం పురస్కరిం చుకుని అమ్మానాన్న ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.25వేలు విలువ గల శ్రీకృష్ణ దేవారాయ మున్సి పల్ హైస్కూల్‌లో విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, నగదు బహుమతులను మంగళవారం అందజేశారు. ప్రతీ ఏడాది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నులు, నగదు బహుమతి పంపిణీ చేస్తున్న ట్రస్ట్ చైర్మన్ మారం హనుమం తరావును అభినందించారు. బండ్రెడ్డి వాసు, అడ్వకేట్ సురేష్, గంగాధర రావు, శ్రీనివాస్, జి.నాగేశ్వరరావు, జి.మాధవ రావు, దళపతి శ్రీనివాసరాజు, ప్రభు, కాకరాల గణేష్, విజయ్‌వర్మ, మారం జయసూర్య పాల్గొన్నారు.

సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో..

ఏలూరు కార్పొరేషన్: తూర్పువీధిలో రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి దివ్య కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి పట్టు వస్త్రాలను సమర్పించారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరిం చాలని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్స వాల్లో భాగంగా మంగళవారం డీటీసీ కార్యాలయంలో పట్టణంలోని ఆటో, మ్యాక్సీ, హెవీ డ్రైవింగ్ స్కూల్ డ్రైవర్లకు రహదారి భద్రతపై రవాణాశాఖ తనిఖీ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ ప్రతి వాహన చోదకుడు తప్పకుండా రహదారి భద్రత నియ మాలను పాటించినప్పుడే ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించగలమన్నారు. మద్యం సేవించి వాహనం నడపవద్దన్నారు. కార్యక్రమానికి 95 మంది డ్రైవర్లు హాజరయ్యారు. ఆర్టీవో కేఎస్ఎంపీ కృష్ణారావు, పరిపాలన అధికారి ఎం.రాము, ఎం.ఆనంద్‌కుమార్, వాహన తనిఖీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.